


# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

07.09.2026
సోమవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 117
పేజీలు : 08 | వెల: రూ.5

AJS
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## దిమాగీ నక్సల్స్ బయటకు వస్తున్నారు

- మోడీ సంచలన వ్యాఖ్యలు
- ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగం
- 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యను మరోసారి ప్రస్తావించిన మోదీ
- ఆ పదాన్ని హోమియోపతి పిల్‌తో పోల్చిన ప్రధాని



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రతిపక్ష నేతలపై విమర్శలు గుప్పిస్తూనే, ఇటీవల ఆందోళన, నిరసనల విషయంలో కూడా పరోక్షంగా స్పందించారు. ముఖ్యంగా యువత, జెన్‌జీని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన.. దేశాభివృద్ధిపై ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో మరోసారి మోడీ ''దిమాగీ నక్సల్స్'' పదాన్ని ఉపయోగించారు. ఇటీవల ఎర్రకోటపై నుంచి మోడీ మాట్లాడుతూ.. దిమాగీ నక్సల్స్ అనే పదాన్ని ఉపయోగించారు.

''ఎర్రకోట నుంచి నేను 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతిలో చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి తీవ్రత పెరిగినట్లు కనిపిస్తుంది. అదే విధంగా నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే ఒక్కొక్కరుగా బయటకు రావడం ప్రారంభించారు. ఇప్పుడు వారిని ప్రోత్సహిస్తున్నవారి నిజస్వరూపాన్ని కూడా ప్రజలు చూస్తున్నారు'' అంటూ ప్రధాని వ్యాఖ్యానించారు. SRCCలో 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా తాను చేసిన ప్రసంగాన్ని మోడీ గుర్తు చేసుకున్నారు. 2లో..

## ఈహెచ్‌ఎస్ అమల్లో రాజీ లేదు

- ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**



ఈహెచ్‌ఎస్ అమల్లో రాజీ లేదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈహెచ్‌ఎస్‌పై ఆదివారం రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రతే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2లో..

## చెన్నైకి కొత్త ఎయిర్‌పోర్టు

- విజయ్ సర్కార్ కీలక ప్రతిపాదనలు
- పరందూర్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు రద్దు
- కొత్త విమానాశ్రయం కోసం మానెల్లోర్, చేయ్యూర్ ప్రాంతాలు షార్ట్‌లిస్ట్



2లో..

# టీడీపీలో కొత్త నాయకత్వం!

## మంగళగిరిలో రెండు రోజుల లీడర్‌షిప్ కాంక్లేవ్

- 10 సెషన్లలో నేతలకు శిక్షణ
- చంద్రబాబు, లోకేశ్ దిశానిర్దేశం
- కేడర్ సమన్వయంపై ప్రత్యేక ఫోకస్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై శిక్షణ
- ప్రభుత్వం–ప్రజలకు వారధిగా నేతలు
- రాజకీయ కమ్యూనికేషన్‌పై కీలక సెషన్లు
- స్థానిక ఎన్నికలకు నేతలకు సన్నద్ధత





2లో..

**హైదరాబాద్, సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

రాజకీయాల్లో కొత్త నాయకత్వ విధానానికి తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుడుతోంది. ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రతినిధులకు నాయకత్వ పటిమ పెంపొందించే అంశంపై రెండు రోజుల ట్రైనింగ్ కాంక్లేవ్‌ను టీడీపీ నిర్వహిస్తోంది. ఈ నెల 7, 8వ తేదీల్లో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌ను నిర్వహించనుంది. రెండు రోజుల్లో 10 సెషన్లల్లో ఈ కాంక్లేవ్ జరగనుంది. ట్రైనింగ్ - ఇంటరాక్టివ్ విధానంలో లీడర్‌షిప్ కాంక్లేవ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేలా కాంక్లేవ్ నిర్వహించేలా ఏపీ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రణాళికలు రచించారు.

## మధ్యప్రదేశ్‌లో విషాదం

- కల్తీ మద్యం తాగి
- తొమ్మిది మంది మృతి
- 25 మందికి పైగా ఆసుపత్రికి తరలింపు

2లో..



## స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలు మోహరించాలి

స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు వైసీపీ లేఖ 6లో..

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కేంద్ర బలగాల మధ్య ఎన్నికలు పూర్తవ్వాలి

## ప్రతిపక్ష నేత హోదాకు కేసీఆర్ న్యాయం చేయాలి

### పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 06, అనంజతనశక్తి న్యూస్**

ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష నేత హోదాకు మాజీ సీఎం కేసీఆర్ న్యాయం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. 6లో..



## పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

- పిడుగులతో వానలు
- ఈదురుగాలుల నేపథ్యంలో..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

2లో..



## సీఎంతో జరిగిన చర్చల్లో హామీలు లభించాయి

- పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు చర్యలపై హర్షం
- ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్
- మొత్తం 5 డీఏల్లో రెండింటి విడుదలపై సంతోషం



**అమరావతి, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించడం పట్ల ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. పీఆర్సీ, డీఏలు, సరెండర్ లీవులు, హెల్త్ కార్డులు, పెన్షనర్ల అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తదితర అంశాలపై సీఎంతో జరిగిన చర్చల్లో పలు హామీలు లభించాయని చెప్పుకొచ్చారాయన. పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మొత్తం 5 డీఏల్లో రెండింటిని ఒకే నెలలో చెల్లిస్తామని, సరెండర్ లీవ్‌లకు సంబంధించి ఒక విడత చెల్లింపు చేస్తామని చెప్పారన్నారు. 6లో..

## వైఎస్ షర్మిల కుమార్తె అంజలి రెడ్డి వివాహం

- వరుడి కుటుంబం కర్నూలు
- అమెరికాలో స్థిరపడ్డారు
- ప్రకటించిన ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు 6లో..



## రేవంత్ ప్రభుత్వం భయపడుతుంది

- అసెంబ్లీని ఎక్కువ రోజులు నడపడానికి..
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



6లో..

**హైదరాబాద్, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీని ఎక్కువ రోజులు నడపడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భయపడుతుందని విమర్శించారు. అసెంబ్లీలో చర్చించే అంశాలపై బీజేఎల్పీ ఆదివారం సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

## కెనాల్ వద్ద ప్రమాదం

- వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్
- ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశాలు
- ఇద్దరు యువకులు గల్లంతు
- డ్రోన్ల సాయంతో గాలింపు చేపడుతున్న పోలీసులు

**వెలిగొండ, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ వద్ద ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. కటకానిపల్లెకు చెందిన ఇద్దరు యువకులు కెనాల్‌లో పడి గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై మంత్రులు నిమ్మల, గొట్టిపాటి రవికుమార్ ఆరా తీశారు. 2లో..



## దిమాగీ నక్సల్స్ బయటకు వస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

13 ఏళ్ల తర్వాత ప్రధాని హోదాలో మళ్లీ వచ్చిన తర్వాత అప్పటికీ, ప్రస్తుత భారత్‌కు తేడాలను విద్యార్థుల ముందుంచారు. కేదార్‌నాథ్ విషాదాన్ని, 2008 ఆర్థిక సంక్షోభాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రస్తావించారు. కేదార్‌నాథ్ విపత్తు సమయంలో అప్పటి ప్రభుత్వం తడబడిందని విమర్శించారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలో ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించలేదని, బ్యాంకింగ్ వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురైందని అన్నారు. కరోనా మహమ్మారి నుంచి పశ్చిమాసియా సంక్షోభం వరకు ప్రతీ అంశాన్ని విద్యార్థుల ముందుంచారు. అనేక ప్రపంచ సంక్షోభాల సమయంలో భారత్ అద్భుతంగా మనుగడ సాధించిందని చెప్పారు. జెన్‌జీతో కనెక్ట్ అయ్యేలా ప్రధాని మోడీ వారి భాషలోనే మాట్లాడారు. వారిని ఆకట్టుకునేందుకు జెన్‌జీ పదాలను ఉపయోగించారు.

## ఈహెచ్ఎస్ అమల్లో రాజీ లేదు



(మొదటిపేజీ తరువాయి)

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు మానవీయ కోణంలో పరిష్కరించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆర్థిక, మానసిక ఇబ్బందులు లేకుండా ఉద్యోగులకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి ఈహెచ్ఎస్ విధివిధానాలను రూపకల్పన చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం 354 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈహెచ్ఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మరిన్ని ఆస్పత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చామని చెప్పుకొచ్చారు.

**హెల్త్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి..**

హెల్త్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈహెచ్ఎస్‌ను ఎవరూ అషామాషీగా తీసుకోవద్దని హుకుం జారీ చేశారు. ఈ పథకం సమర్థవంతమైన అమలుకు ఆయా ఆస్పత్రులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు, ఉద్యోగ సంఘాల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై తమ ప్రభుత్వం కమిటెడ్‌గా ఉందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఢిల్లీలో కుప్పకూలిన ఆరంతస్తుల భవనం.. శిథిలాల కింద చిక్కుకున్న పలువురు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం సంభవించింది. నైరుతి ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఆరు అంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. శిథిలాల కింద అనేక మంది చిక్కుకోవడంతో సహాయక బృందాలు వారికోసం గాలిస్తున్నాయి. వారు ప్రాణాలతో ఉంటారా? అని భయపడుతున్నట్లు ప్రభుత్వ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇప్పటివరకు ఆరుగురిని భవనం నుంచి రక్షించగా.. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఇద్దరిని రక్షించినట్లు పోలీసులు ఒక అంచనా మాత్రమే ఇచ్చారు. కానీ శిథిలాల కింద చిక్కుకున్న వారి సంఖ్యను వెల్లడించడానికి నిరాకరించారు. స్థానిక పోలీసులు, అగ్నిమాపక దళం, అంబులెన్స్, ఇతర అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలంలో ఉన్నారని ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. 75 పడకల పేయింగ్ గెస్ట్ వసతిగా ఉన్న ఈ భవనం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో కూలిపోయిందని అధికారులు తెలిపారు.
భవనం కూలిపోయిన సమయంలో కనీసం 50 మంది విద్యార్థులు లోపలే ఉన్నారని ఒక ప్రత్యక్ష సాక్షి తెలిపారు. ఆదివారం కావడంతో చాలామంది 'ఇంట్లోనే' ఉన్నారని ఆమె అన్నారు. ఘటనా స్థలంలో ఉన్న ఒక విద్యార్థి, శిథిలాల కింద నుంచి సహాయం కోసం కేకలు విన్నానని ఏఎన్ఐకు తెలిపారు. కూలిపోయిన భవనం 'హాస్టల్ డేజ్' అనే పురుషుల పీజీ అని మరో ప్రత్యక్ష సాక్షి వర్ణించారు. ఘటనాస్థలిలో దృశ్యాలు భవనం ఉన్న చోట పెద్ద సంఖ్యలో జనం గుమిగూడి ఉండగా.. అగ్నిమాపక సిబ్బంది శిథిలాల కింద ప్రాణాలతో ఉన్నవారి కోసం వెతుకుతున్నట్లు కనిపించింది. సహాయక సిబ్బంది, యంత్రాలు వచ్చే వరకు వేచి చూడకుండా స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు.
ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోన్న ఓ వీడియోలో ఒక వ్యక్తి కాంక్రీట్ స్లాబ్ కింద ఇరుక్కుని ఉండగా.. దానిని పైకి లేపడానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించింది. కనీసం 12 ఫైర్ ఇంజిన్లను ఘటనా స్థలానికి పంపినట్టు అధికారులు పేర్కొన్నారు. సహాయక చర్యల కోసం ఇప్పటికే ఒక ఎక్స్‌కవేటర్‌ను రంగంలోకి దించారు. స్లాబ్‌లు, గర్డర్‌లను తొలగించడానికి మరిన్ని యంత్రాలను తీసుకువస్తున్నారు. అగ్నిమాపక బృందాలకు మద్దతుగా విపత్తు ప్రతిస్పందన దళాలను కూడా మోహరించారు. ఘటన ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పందించారు. భవనం కూలిపోవడంపై తీవ్ర ఆందోళన చెందుతున్నానని, సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు.
''ముందుజాగ్రత్త చర్యగా పక్కనే ఉన్న భవనాన్ని ఖాళీ చేయించారు. లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి.. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం కోసం సాధ్యమైన అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాం.. సంబంధిత ఏజెన్సీలన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయి.. ప్రతి పౌరుడి భద్రత, క్షేమమే మా ప్రథమ ప్రాధాన్యత'' అని సీఎం రేఖా గుప్తా అన్నారు.



# చెన్నైకి కొత్త ఎయిర్‌పోర్టు

**చెన్నై, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**



చెన్నైకి రెండో ఎయిర్‌పోర్టుపై విజయ్ సర్కార్ రెండు ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించింది. పరంబూర్‌లో ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును విజయ్ అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేశారు. ఇప్పుడు కొత్తగా మానెల్లోర్, చేయ్యూర్ ప్రాంతాలను కొత్త ఎయిర్‌పోర్టు కోసం షార్ట్ లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. వారం రోజుల్లోనే ఈ రెండు ప్రాంతాలను గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ రెండు ప్రాంతాలను ''ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ''కు పంపించి, ఫీజిబిలిటీ సర్వే చేయాలని ప్రభుత్వం సిఫారసు చేసింది. విమానాశ్రయం నిర్మాణానికి సాంకేతిక అనుకూలత, కనెక్టివిటీ, భూమి లభ్యత వంటి అంశాలను పరిశీలించి తర్వాత నిర్ణయం తీసుకోనున్నారు.
మానెల్లోర్ చెన్నైకి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉండగా, చేయ్యూర్ సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతిపాదిత విమానాశ్రయం చెన్నై మెట్రోపాలిటన్ ఏరియా అవసరాలను తీర్చేలా ఉండనుంది. పరంబూర్ ఎయిర్ పోర్టు ప్రాజెక్టు రద్దుపై విజయ్ ప్రభుత్వం ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. అయితే రైతులు, వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలపై ప్రభావాన్ని తగ్గించేందుకు పెరంబూర్ ప్రాజెక్టును రద్దు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. చెన్నైకి రెండో ఎయిర్ పోర్టు అవసరమే కానీ, దాని కోసం వ్యవసాయం భూములు, నివాస ప్రాంతాలకు తక్కువ నష్టం కలిగించే ప్రాంతాన్ని ఎంచుకోవాలని విజయ్ అసెంబ్లీలో చెప్పారు.
గతంలో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే సర్కార్ పరంబూర్ ప్రాజెక్టు విషయంలో రైతులు, స్థానికుల నుంచి నిరసనలు ఎదుర్కొంది. ప్రాజెక్టు కోసం భారీ స్థాయిలో భూసేకరణ అవసరం కావడం, నీటి వనరులు, వ్యవసాయ భూములు కోల్పోయే అవకాశం ఉండటంతో నిరసనలు జరిగాయి. ఇప్పుడు మానెల్లోర్, చేయ్యూర్‌ను ప్రత్యామ్నాయంగా ఎంచుకోవడంతో విజయ్ సర్కార్ చెన్నైకి రెండో విమానాశ్రయంపై అడుగులు పడ్డాయి.

# మధ్యప్రదేశ్‌లో విషాదం

**భోపాల్, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం అనుమానిత ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బండా సబ్‌డివిజన్ పరిధిలోని ఘూఘ్రా, జాలంపూర్, బరాజ్ తదితర గ్రామాల్లో అనుమానాస్పద మద్యం సేవించిన పలువురు గ్రామస్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇప్పటివరకు 9 మంది మృతి చెందినట్లు అధికారికంగా నిర్ధారించారు. మరో 25 మందికి పైగా మెరుగైన వైద్యం కోసం సాగర్‌కు తరలించారు.

**అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన గ్రామస్థులు**

అనుమానాస్పద మద్యం సేవించిన తర్వాత పలువురు గ్రామస్థుల ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. వాంతులు, ఇతర అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న వారిని వెంటనే బండాలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉన్నవారిని మెరుగైన వైద్య సేవల కోసం సాగర్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నారు. దీంతో ఆసుపత్రిలో తీవ్ర ఆందోళన నెలకొంది.

**ఘటనాస్థలికి కలెక్టర్, ఎస్పీ**

ఘటన తీవ్రతను గుర్తించిన జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమైంది. సాగర్ కలెక్టర్ ప్రతిభా పాల్, పోలీసు సూపరింటెండెంట్ అనురాగ్ సుజానియా అధికార యంత్రాంగంతో కలిసి ప్రభావిత గ్రామాలకు చేరుకున్నారు. వారు గ్రామాల్లో పరిస్థితిని పరిశీలించడంతో పాటు బండా ఆసుపత్రిని సందర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.



**9 మంది మృతి.. అధికారికంగా నిర్ధారణ**

సాగర్ జిల్లా సీఎంహెచ్ఓ డాక్టర్ దేవేశ్ పటేరియా ఇప్పటివరకు 9 మంది మరణించినట్లు అధికారికంగా వెల్లడించారు. మరో 25 మందికి పైగా బాధితులను మెరుగైన చికిత్స కోసం సాగర్‌కు తరలించినట్లు తెలిపారు. వైద్యుల బృందం ఇప్పటికే రాత్రి నుంచే ప్రభావిత ప్రాంతంలో అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. అనుమానాస్పద మద్యం సేవించిన తర్వాత ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

**పోలీసు, ఎక్సైజ్ శాఖల దర్యాప్తు**

ఈ ఘటనపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ దర్యాప్తు ప్రారంభించాయి. గ్రామస్థులు సేవించిన మద్యం నిజంగా కల్తీదేనా, దాని వల్లే ఈ మరణాలు సంభవించాయా అనే అంశంతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో అధికారులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభావిత గ్రామాల్లో పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించడంతో పాటు అనుమానాస్పద మద్యం సరఫరా వెనుక ఉన్న వ్యక్తులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

# పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

**అమరావతి, సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లాలలో రాబోయే మూడు గంటల్లో తీవ్రమైన ఉరుములు, పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం 3 గంటల 30 నిమిషంలో ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఈ సమయంలో గంటకు 50 కిలోమీటర్ల నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తం చేసింది.
పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో.. ప్రజలు, ముఖ్యంగా రైతులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. గాలివాన సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడవద్దని హెచ్చరించింది. పిడుగుపాటు, వర్ష తీవ్రత రూపుదాల్చుతున్న నేపథ్యంలో..గతంలో జారీ చేసిన ఆరెంజ్ అలర్ట్‌ను సవరించి రెడ్ అలర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు గంటలు అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.



తుని, అన్నవరం, నర్సీపట్నం, ఎలమంచిలి, అనకాపల్లి,కోటనందూరు, జగ్గంపేట, ఏలేశ్వరం పరిసర ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. నూజివీడు, ఆగిరిపల్లి, గన్నవరం, ఏలూరు, మైలవరం, నున్న, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.
మరోవైపు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాధారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తుంటాయి. అయితే ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు సకాలంలో కురవడం లేదు. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగినట్లు అధికారులు చెప్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఎండాకాలాన్ని తలపించేలా వాతావరణం ఉంటున్న కారణంగా... ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరిగింది. దీంతో గ్రామీణ ప్రాంతాలలో కొన్నిచోట్ల విద్యుత్ కోతలు ఉంటున్నాయి. అలాగే విద్యుత్ వినియోగం కూడా పెరిగినట్లు లెక్కలు చెప్తున్నాయి.

## కెనాల్ వద్ద ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి నిమ్మల రామానాయుడు.. యువకులు గల్లంతుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫీడర్ కెనాల్‌లో నీరు వేగంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో.. ప్రజలు ఎవరూ కూడా నీళ్లలో దిగవద్దని సూచించారు. అలాగే నల్లమల సాగర్‌లో లోతు అంచనా వేయడం కష్టం కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిన మంత్రి సూచించారు. నల్లమల సాగర్, ఫీడర్ కెనాల్ వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.
ఇక వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లో గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రెండు రోజుల నుంచి యువకుల ఆచూకీకి కోసం డ్రోన్‌ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు మంత్రి రవికుమార్‌కు తెలిపారు. ఈ నేపథ్యంలో వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ వద్ద పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని పోలీసులకు మంత్రి రవి కుమార్ సూచించారు.
మరోవైపు దోర్నాల మండలంలోని కటకానిపల్లె సమీపంలోవెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. కటకానిపల్లె గ్రామానికి చెందిన పుష్పాల రాజ్‌కుమార్ అనే యువకుడు తన స్నేహితులు, బంధువులతో కలిసి ఫీడర్ కెనాల్ దగ్గరకు వెళ్లారు. సెప్టెంబర్ 7వ తేదీన రాజ్‌కుమార్ పెళ్లి ఉండటంతో.. ఫీడర్ కెనాల్ వద్ద పార్టీ చేసుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే రాజ్ కుమార్, రాజు, వినయ్ కుమార్ ఈతకొట్టేందుకు ఫీడర్ కెనాల్‌లో దిగగా.. నీటి ప్రవాహానికి రాజ్ కుమార్, వినయ్ కుమార్ కొట్టుకుపోయారు. రాజు కష్టమ్మీద ఒడ్డుకు చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలో గల్లంతైన ఇద్దరు యువకుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



## టీడీపీలో కొత్త నాయకత్వం!

(మొదటి పేజీ తరువాయి)

**ఈ కాంక్లేవ్‌కు చంద్రబాబు, లోకేశ్ హాజరు కానున్నారు. క్షేత్రస్థాయి యంత్రాంగం, కేడర్ సమన్వయం, పొలిటికల్ రెస్పాన్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాల్లో నేతల సామర్థ్యాలను మెరుగుపరిచేలా రెండు రోజుల పాటు ట్రైనింగ్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వం - ప్రజలకు వారధిగా పార్టీ నేతలు ఉండాలని చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో చంద్రబాబు అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం - టీడీపీ చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం... ప్రత్యర్థి పార్టీల కుట్రలను ఎండగట్టడం వంటి అంశాలపై కాంక్లేవ్‌లో కీలకంగా చర్చించనున్నారు.**

**ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ముఖ్య నేతలు హాజరు కానున్నారు. మొదటి రోజున నాయకత్వ అభివృద్ధి, నాయకులను తీర్చిదిద్దడం, సరైన స్థానంలో నిలబెట్టడం - పార్టీ సంస్థాగత నిర్మాణం, అజెండా, పనితీరు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం - స్వర్ణాంధ్ర విజన్ - రాజకీయ, ఆర్థిక సాధికారత - సంపూర్ణ సంక్షేమం, సాధికారత అంశాలపై చంద్రబాబు, లోకేశ్ మార్గనిర్దేశం చేయనున్నారు. రెండో రోజున సుస్థిర అభివృద్ధి, ప్రజా సేవలు, సుపరిపాలన, పొలిటికల్ కమ్యూనికేషన్ - ప్రజలకు సేవల చేరువ, ఎల్‌నినోపై అవగాహన, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత అంశాలపై చంద్రబాబు, లోకేశ్ దిశానిర్దేశం చేయనున్నారు.**



# మద్యం మత్తులో మహిళపై మైనర్ లైంగిక దాడి..

**- బాధితురాలికి రక్షణగా నిలిచి తరిమికొట్టిన వీధి కుక్కలు!**



మనుషుల్లో మానవత్వం నశిస్తున్న ప్రస్తుత రోజుల్లో మూగజీవాలు ప్రదర్శించిన చాకచక్యం, సకాలంలో చూపిన స్పందన ఒక మహిళను తీవ్రమైన ప్రమాదం నుంచి కాపాడాయి. ముఖ్యంగా తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో.. అర్ధరాత్రి వేళ మద్యం మత్తులో ఒక మైనర్ బాలుడు మహిళపై లైంగిక దాడికి ఒడిగట్టగా.. ఆ వీధిలోని కుక్కలన్నీ కళ్లారా ఆ ఘటనను చూశాయి. వాటికి ఏమర్థం అయిందో తెలియదు కానీ.. ఒక్కసారిగా ఆ శునకాలన్నీ అతడి పైకి లేచాయి. చాలా దూరం పాటు అతడిని తరిమికొట్టాయి. అయితే ఈ దృశ్యాలన్నీ అక్కడే ఉన్న ఓ సీసీ కెమెరాలో రికార్డు కాగా.. ప్రస్తుతం ఇవి కాస్తా నెట్టింట వైరల్ అవుతున్నాయి.

**దుకాణానికి నిప్పు.. ఆపై మహిళపై వికృత చేష్టలు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 3వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1.30 గంటల సమయంలో కోయంబత్తూరులోని తుడియాలూర్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. తీవ్రమైన మద్యం మత్తులో ఉన్న 16 ఏళ్ల మైనర్ బాలుడు మొదట ఒక దుకాణంలోకి అక్రమంగా చొరబడి దానికి నిప్పు పెట్టాడు. ఆ తర్వాత నిర్మానుష్యంగా ఉన్న ఒక వీధి గుండా వెళ్తుండగా.. మానసిక వికలాంగురాలైన ఓ 30 ఏళ్ల మహిళ, తన ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఆమెపై కన్నేసిన ఆ తాగుబోతు మైనర్.. ఒక్కసారిగా ఆమెపైకి దూకి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.

**దేవుళ్లలా మారిన వీధి కుక్కలు**

ఆ మహిళపై మైనర్ దాడి చేస్తున్న సమయంలో ఆ వీధిలోని కుక్కలన్నీ ఒక్కసారిగా అప్రమత్తమ అయ్యాయి. బాలుడి వికృత చర్యలను గమనించిన ఆ మూగజీవాలు అతడి చుట్టూ చేరి గట్టిగా మొరుగుతూ, అతడి కాళ్లను గోళ్లతో గీరుతూ మహిళను వదిలిపెట్టే లా తీవ్రంగా ఒత్తిడి తెచ్చాయి. కుక్కలు వదలకుండా, మొరుగుతూ అతడి వెంటే పరుగులు పెట్టగా.. భయపడిపోయిన అతడు బాధితురాలిని వదిలేసి పరుగులు తీశాడు. కుక్కలు అతడిని కొంతదూరం వరకు వెంటపడి తరిమికొట్టాయి. ఈ దృశ్యాలన్నీ అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డు అయ్యాయి.

**నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**

దుకాణానికి నిప్పు పెట్టిన ఘటనపై దర్యాప్తు చేపట్టిన కోయంబత్తూరు సిటీ పోలీసులు.. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ఈ లైంగిక వేధింపుల దారుణం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తీవ్రమైన మానసిక లోపంతో బాధ పడుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. వెంటనే చర్యలు చేపట్టిన పోలీసులు.. సదరు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 74, 75, 79 కింద కేసులు నమోదు చేసి.. జువైనల్ హోమ్‌కు తరలించారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

# ఢిల్లీ ప్రయాణికులకు బిగ్ అలర్ట్: 25 ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు.. తెలీకుండా వెళ్లారంటే ఇబ్బందులు తప్పవు!




భారత్ వేదికగా త్వరలో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'బ్రిక్స్ సదస్సు 2026' కోసం దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఈ అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ క్రమంలోనే విదేశీ ప్రతినిధుల భద్రత, మోటార్ కేడ్ కదలికలను పరిశీలించేందుకు ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు సెప్టెంబర్ 6వ తేదీ ఆదివారం అంటే ఈరోజే ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మోటార్ కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించనున్నారు. మొత్తంగా నగరంలోని 22 కీలక మళ్లింపు పాయింట్ల ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనున్నట్లు, దాదాపు 25కి పైగా ప్రధాన మార్గాల్లో రాకపోకలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు అడ్వైజరీ విడుదల చేశారు.

**ప్రభావం పడే ప్రధాన రహదారులివే..!**

ఈ కాన్వాయ్ రిహార్సల్స్ కారణంతో సర్దార్ పటేల్ మార్గ్, అక్బర్ రోడ్, మదర్ తెరెసా క్రెసెంట్, తీన్ మూర్తి మార్గ్, జన్‌పథ్, అశోకా రోడ్, బారాఖంబా రోడ్, మథురా రోడ్, శాంతిపథ్, నీతి మార్గ్, టాల్‌స్టాయ్ మార్గ్ మరియు కనౌట్ ప్లేస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. డాక్టర్ దినేష్ నందిని దాల్మియా చౌక్ (డబ్ల్యూపాయింట్) వద్ద తిలక్ మార్గ్ వైపు వాహనాల అనుమతి ఉండదు. అలాగే రామ్‌చరణ్ అగర్వాల్ చౌక్ వద్ద వాణిజ్య వాహనాలను ముందుకు అనుమతించరు. వీటిని బీఎస్‌జెడ్ మార్గ్, ఢిల్లీ గేట్, డీడీయూ మార్గ్ వైపు మళ్లిస్తారు. మిర్ దార్ద్ చౌక్, కనౌట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, పటేల్ చౌక్, ఆర్ఎమ్ఎల్ హాస్పిటల్ రౌండ్ అబౌట్ వద్ద వాహనాలను ఇతర ప్రత్యామ్నాయ రహదారులకు దారి మళ్లించనున్నారు.

**విమానాశ్రయం, ధౌలా కువాన్ మార్గాల్లో ఆంక్షలు..**

విమానాశ్రయం, గుర్గావ్ వైపు వెళ్లే ప్రయాణికులు ధౌలా కువాన్ వద్ద సర్దార్ పటేల్ మార్గ్‌కు బదులుగా వందేమాతరం మార్గ్, ఎన్‌హెచ్ 48ను ఉపయోగించుకోవాలని సూచించారు. మోతీ బాగ్ ఫ్లైఓవర్ వద్ద శాంతిపథ్ వైపు అనుమతి లేకపోవడంతో వాహనాలను రింగ్ రోడ్డు, రావు తులారామ్ మార్గ్ వైపు మళ్లించనున్నారు. ఇటు మండి హౌస్ వద్ద ఫిరోజ్ షా రోడ్, భగవాన్ దాస్ రోడ్ వైపు రాకపోకలు నిలిపివేసి బారాఖంబా, సికంద్రా రోడ్ల ద్వారా దారి మళ్లిస్తారు. భైరాన్ రోడ్, లోధి రోడ్, మదర్సా టీపాయింట్, నీలా గుంబద్ పరిసర ప్రాంతాల్లోనూ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయి.

**ప్రయాణికులకు ట్రాఫిక్ పోలీసుల ముఖ్య విజ్ఞప్తి**

సదస్సు రిహార్సల్స్ జరుగుతున్న సమయంలో అత్యవసర సేవల వాహనాలకు ప్రాధాన్యతా క్రమంలో మార్గం సుగమం చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. సాధారణ ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, అదనపు ప్రయాణ సమయాన్ని కేటాయించుకోవాలని సూచించారు. వీలైనంత వరకు ప్రైవేట్ వాహనాలను పక్కనబెట్టి మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని, రోడ్డుపై విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది సూచనలను ఖచ్చితంగా పాటించాలని ఢిల్లీ ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# పిల్లలను తీర్చిదిద్దే పుణ్యకార్యం టీచర్లదే



పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే పుణ్యకార్యం టీచర్లకే సాధ్యమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. బాల్యం నుంచే పిల్లల్లో శారీరక, మానసిక వికాసంతో పాటు నైతికతను పెంపొందించడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. దేశ రెండో రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన 82 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ద్రౌపదీ ముర్ము శనివారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ప్రదానం చేశారు. అనంతరం ఆమె ప్రసంగిస్తూ 'ఉపాధ్యాయుల మార్గదర్శనం వల్లే నా జీవన యాత్రలో ముందడుగు వేసి మీ ముందు నిలవగలిగాను. పాఠశాల విద్యే మన చదువులకు మూలాధారం. జ్ఞానం, నైపుణ్యాలను జీవితంలో ఎప్పుడైనా సాధించొచ్చు. కానీ సత్ప్రవర్తనను చిన్నతనం నుంచే నేర్పాలి. టీచర్లు చెప్పిన పాఠాలను పిల్లలు మరచిపోయినా వారు నేర్పిన గుణగణాలను జీవితాంతం గుర్తుంచుకుంటారు. పిల్లల్లో కొందరు సహజంగానే బిడియంతో ఉంటారు. మరికొందరిలో అపారమైన ప్రతిభ ఉన్నా ఆత్మవిశ్వాసం లోపించి సతమతమవుతుంటారు. అలాంటి వారిని గుర్తించి తీర్చిదిద్దడం టీచర్ల ప్రధాన బాధ్యత. పుష్కరకాలం కిందట మన ప్రాథమిక పాఠశాలల్లో డ్రాపవుట్ రేట్ 4.5% దాకా ఉండేది. ఇప్పుడు అది దాదాపు సున్నాకు చేరుకుంది. ఇంతటి మహత్తర కార్యాన్ని విజయవంతంగా నిర్వహించిన టీచర్లందరినీ అభినందిస్తున్నా' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, సహాయ మంత్రులు జయంత్‌చౌధరి, సుకాంత మజుందార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించిన వారిలో తెలుగు రాష్ట్రాలతో సంబంధం ఉన్నవారు ఆరుగురు ఉన్నారు.

# కల్తీ మద్యం తాగి 9 మంది మృతి

మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కల్తీ మద్యం తాగి 9 మంది మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. సాగర్ జిల్లాలోని నాలుగు గ్రామాల్లో శనివారం రాత్రి మద్యం తాగిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర వాంతులు, ఇతర అనారోగ్య లక్షణాలు కనబడటంతో వారి కుటుంబీకులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఇప్పటి వరకు 9 మంది మృతిచెందారు. 30 మందికిపైగా చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అధికారులు వెంటనే స్పందించి వైద్య బృందాలను రంగంలోకి దించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అనారోగ్యానికి గురైన వారిని గుర్తిస్తున్నారు. అస్వస్థతగా ఉన్నవారిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు. మద్యంలో విషపూరిత రసాయనం కలిసిందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా విక్రయించిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపారు. ఈ ఘటనపై విచారణకు జిల్లా యంత్రాంగం ఆదేశించింది. ఆయా ప్రాంతాల్లో గత 24 నుంచి 48 గంటల్లో మద్యం తాగిన వారు.. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు.



# అంత్యక్రియలు ముగిసిన 15 రోజులకు..బతికున్నాడంటూ కాల్



పంజాబ్‌లోని కపుర్తలాలో ఓ ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల తమ కుమారుడు కనిపించకుండా పోయాడని ఫిర్యాదు చేసిన ఓ కుటుంబానికి .. స్థానిక పోలీసులు ఓ మృతదేహాన్ని అప్పగించారు. అది తమ కుమారుడే అని భావించిన ఆ కుటుంబసభ్యులు అంత్యక్రియలు చేశారు. చనిపోయాడనుకున్న కుమారుడు.. బతికే ఉన్నాడని 15 రోజుల తర్వాత పోలీసుల నుంచి ఫోన్ రావడంతో ఆశ్చర్యపోయారు. పంజాబ్‌లోని కపుర్తలా గ్రామానికి చెందిన రవి కుమార్ ఆగస్టు 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతడి ఆచూకీ తెలియకపోవడంతో ఆగస్టు 11న కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు అతడి కోసం గాలిస్తుండగా.. కాలిపోయిన స్థితిలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు రవికుమార్ కుటుంబసభ్యులకు దానిని సమాచారం ఇచ్చారు. ఆ మృతదేహం తమ కుమారుడిదేనని అతడి తల్లిదండ్రులు గుర్తించడంతో వారికి అప్పగించారు. ఆగస్టు 13న మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సెప్టెంబర్ 2న కపుర్తలా సెంట్రల్ జైలు పోలీసుల నుంచి రవికుమార్ కుటుంబానికి ఫోన్ కాల్ వచ్చింది. అతడు చనిపోలేదని.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న కేసులో నెల రోజుల క్రితం జలంధర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలపడంతో కుటుంబసభ్యులు ఆశ్చర్యపోయారు. జైలుకు వెళ్లిన కుటుంబసభ్యులు అక్కడ రవికుమార్‌ను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చనిపోయాడనుకున్న తమ కుమారుడు మళ్లీ రావడంతో ఆనందంతో కన్నీరు పెట్టుకున్నారు. అయితే, అంత్యక్రియలు నిర్వహించిన ఆ మృతదేహం ఎవరిదనే కోణంలో పోలీసులు ఇప్పుడు దర్యాప్తు చేపట్టారు.

# నదిని శుభ్రం చేసిన బిట్టూ.. జాబ్ ఆఫర్ చేసిన నెదర్లాండ్స్ సీఈవో



మధ్యప్రదేశ్‌లో ఇటీవల అజ్నార్ నదిని శుభ్రం చేసిన ఓ 20ఏళ్ల యువకుడు 'బిట్టూ తబాహి' ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఇటీవల వైరల్‌గా మారిన అతడికి నెదర్లాండ్స్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ ఉద్యోగం ఆఫర్ చేసింది. పర్యవరణ పరిరక్షణపై బిట్టూ చూపిన చొరవకు ముగ్ధుడైన డచ్ సంస్థ సీఈవో బోయన్ స్లాట్.. తమతో కలిసి పనిచేయాలంటూ ఆన్‌లైన్‌లో ఆహ్వానించడం విశేషం.

మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన సురేంద్ర సింగ్ చౌధరీ (బిట్టూ తబాహి) డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నది ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా మారడాన్ని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈత రాకున్నా.. గ్లౌజ్‌లు, బూట్లు లేకపోయినా.. వ్యర్థాలు తొలగించే పని మొదలుపెట్టాడు. మధ్యలో కొందరు స్నేహితులు తోడుగా నిలవడంతో కొన్ని నెలల్లోనే పూర్తిచేశాడు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన బిట్టూ ప్రయాణం ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది.

# బల్లకట్టు కాదు.. ఇల్లు



ఇదేదో నదిలో బల్లకట్టు వెళ్తున్నట్లు ఉంది కదూ.. గంగానది నీటి మట్టం పెరగడంతో బిహార్ రాజధాని పట్నాలోని నక్తా దియారా పరివాహక ప్రాంతంలో ఓ ఇంటిని చుట్టుముట్టిన వరద

# సకాలంలో అందితేనే న్యాయం సార్థకం



**- బ్రిక్స్ దేశాల సదస్సులో జస్టిస్ సూర్యకాంత్**

భేదాభిప్రాయాన్ని ఆరోగ్యకరమైన రీతిలో వ్యక్తీకరించే సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శనివారం నొక్కిచెప్పారు. బ్రిక్స్ దేశాల ప్రధాన న్యాయమూర్తుల వేదిక సమావేశంలో రెండో రోజు జరిగిన ప్రతినిధి బృందాల సదస్సులో ఆయన ప్రసంగిస్తూ... న్యాయాన్ని సమయానికి అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా తదితర సభ్యదేశాల న్యాయ వ్యవస్థల అధినేతలు పాల్గొన్నారు. బ్రెజిల్ సుప్రీం ఫెడరల్ కోర్టు అధ్యక్షుడు లూయిజ్ ఎడ్సన్ ఫషిన్ వర్చువల్ పద్ధతిలో సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఐగోర్ క్రాస్నోవ్, చైనా ప్రధాన న్యాయమూర్తి జాంగ్ జున్, ఈజిప్టు సుప్రీం రాజ్యాంగ కోర్టు చీఫ్ జస్టిస్ బూలోస్ గాహ్మా తదితరులు ఈ సమావేశంలో ప్రసంగించారు. ప్రపంచ దేశాల న్యాయ వ్యవస్థల మధ్య సహకారం పెంపొందించి, ప్రపంచ న్యాయ నాగరికత స్థాపన జరగాల్సిన అవసరం ఉందని చైనా ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ దేశాల ప్రధాన న్యాయమూర్తుల వేదిక సదస్సు రెండో రోజు మొత్తం నాలుగు సమావేశాలు జరిగాయి.

# కేశ సౌందర్యానికి వేలం వెర్రి

**అవసరమైతేనే శస్త్రచికిత్సకు వెళ్లాలంటున్న నిపుణులు**

సామాజిక మాధ్యమాలు ప్రచారం చేసే సౌందర్య స్పృహ.. 20 ఏళ్ల ప్రాయంలో ఉన్నవారు కూడా జుట్టు మార్పిడి చికిత్స కోసం వైద్యులను సంప్రదించేలా పురిగొల్పుతోందని నిపుణులు తెలిపారు. కొందరు యువకులు జుట్టు పలచబడిపోవడాన్ని అరికట్టడానికి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం సంప్రదిస్తున్నారని వివరించారు. అయితే కేశ సౌందర్యం కోసం జుట్టు మార్పిడి చికిత్స చేయబోమనీ.. జుట్టు రాలడానికి కారణం, దాని తీవ్రతను అంచనా వేసిన తరవాతే శస్త్రచికిత్సపై నిర్ణయం తీసుకుంటామని నిపుణులు చెప్పారు. సోషల్ మీడియా కారణంగా నిరంతరం పోలికలు చూసుకుంటున్న యువకులు తమ తలకట్టులో వచ్చే చిన్నచిన్న మార్పులను కూడా అతిగా పట్టించుకుంటున్నారని దిల్లీలోని ఎయిమ్స్ చర్మవ్యాధుల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ నీతు భారి తెలిపారు. చిన్న వయసులో జుట్టు రాలిపోవడాన్ని మొదట వైద్యపరమైన సమస్యగా, ఆ తర్వాతే సౌందర్య సమస్యగా పరిగణించాలని ఆమె చెప్పారు. జుట్టు రాలిపోయే కేసుల్లో సగం మందికి పైగా కుటుంబాల్లో అలాంటి చరిత్ర ఉంటుందని మరో నిపుణుడు డాక్టర్ గౌరవ్ గార్గ్ వివరించారు. యువతలో జుట్టు రాలిపోవడానికి చర్మవ్యాధి కారణమా అని మొదట శోధించాలనీ, అది కాదని తేలిన తరవాతే కాస్మొటిక్ పరిష్కారం కోసం ఆలోచించాలని మేదాంత హాస్పిటల్ డెర్మటాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ రమణ్‌జీత్ సింగ్ చెప్పారు.





# అమెరికా ఘోర తప్పిదం

గత నెల రోజులుగా ప్రశాంతంగా వున్న పశ్చిమాసియాలో మళ్లీ చిచ్చురేగింది. తాజాగా అమెరికా మొదలెట్టిన క్షిపణి దాడులు, ఇరాన్ సాగిస్తున్న ప్రతిదాడులతో అది భగ్గున మండుతోంది. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో పెళ్లి వేడుకలు జరుగుతున్న ఇంటిపై అమెరికా క్షిపణి పడి అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. వేరేచోట జరిగిన దాడిలో నలుగురు ఇరాన్ రెవల్యూషనరీ గార్డులు చనిపోయారు. ఈ దాడులకు ప్రతీకారంగా గల్ఫ్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. ఇజ్రాయెల్‌తో కలిసి అకారణంగా తానే ప్రారంభించిన ఈ యుద్ధంలో అమెరికా సర్వభ్రష్టమైంది. దీన్నుంచి బయటపడటానికి చేసిన యత్నాలన్నీ విఫలంకాగా... ప్రపంచ దేశాలతో ఇరాన్ ఆర్థిక లావాదేవీలన్నిటినీ 'కనీవినీ ఎరుగని రీతిలో' దెబ్బతీసే ఆర్థిక దిగ్బంధం ప్రారంభించామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించి వారం రోజులవుతుండగా తాజా దాడులు మొదలయ్యాయి. రోజులు మారాయని, తన ఆధిపత్య విధానాలకు కాలం చెల్లిందని అమెరికా గ్రహించుకోలేక ఈ నిరర్థక యుద్ధానికి తెరలేపింది. ఇది సోవియెట్‌తో పోటీపడుతూ ఆధిక్యత సాధించటానికి ప్రయత్నించిన '60ల, '70ల కాలం కాదు. సోవియెట్ పతనం తర్వాత కొన్నాళ్లపాటు సాగిన ఏకధ్రువ ప్రపంచం కూడా కాదు. కనీసం ట్రంప్ తొలి ఏలుబడినాటి పరిస్థితులు కూడా ఇప్పుడు లేవు. ఇరాన్ ఆర్థిక దిగ్బంధం గురించి గత నెల 25న ట్రంప్ ప్రకటన చేసిన వెనువెంటనే చైనా, ఖతార్‌లు ఈ చట్టవిరుద్ధ, ఏకపక్ష ఆంక్షల్ని గుర్తించదల్చుకోలేదని చెప్పడాన్ని బట్టే వర్తమాన పరిస్థితులేమిటో అర్థమవుతాయి. ఉక్రెయిన్ యుద్ధంలో పీకల్లోతు మునిగిన రష్యా కూడా ఈ ఆంక్షల్ని పాటించే స్థితిలో లేదు.

అమెరికా ఆంక్షల వల్ల 2018లో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొంతమేర దెబ్బతిన్న మాట వాస్తవమే. కానీ దాన్ని పూర్తిస్థాయిలో ధ్వంసం చేయటం, చమురు ఎగుమతుల్ని సంపూర్ణంగా నిలిపేయటం అమెరికాకు సాధ్యం కాలేదు. కనీసం అప్పుడున్న అంతర్జాతీయ, ప్రాంతీయ పరిస్థితులు ఏదోమేర ఆంక్షలు అమలుకు దోహదపడ్డాయి. అప్పట్లో సౌదీ, యూఏఈ, బహ్రైన్, ఈజిప్టులు ఖతార్‌తో సంబంధాలు తెంచుకున్నాయి. కువైట్, ఒమన్‌లు మాత్రం దానితోనే కలిసి నడిచాయి. కానీ 2021 తర్వాత ఈ పరిస్థితి మారింది. ఎడమొహం, పెడమొహంగా ఉండే సౌదీ, ఇరాన్‌లు సంబంధాలు పునరుద్ధరించు కున్నాయి. ప్రాంతీయంగా గల్ఫ్ దేశాలన్నిటిమధ్యా ఇప్పుడు అవగాహన కుదిరింది. నిరుడు సెప్టెంబర్ 9న దోహాపై ఇజ్రాయెల్ సాగించిన దాడి వీటి కళ్లు తెరిపించింది. ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై మొదలెట్టిన యుద్ధాన్ని గల్ఫ్ దేశాలు వ్యతిరేకించక పోవచ్చుగానీ... పాలస్తీనా ఏర్పాటుకు అనువైన రాజకీయ పరిష్కారం దొరికే వరకూ ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలు అసాధ్యమని సౌదీ స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈలోగా ఆంక్షల్ని అధిగమించటానికి అంతర్జాతీయంగా ఇరాన్ ఇప్పటికే ఏర్పర్చుకున్న నెట్‌వర్క్ అమెరికా ఆటల్ని సాగనివ్వటంలేదు.

తాజా పరిణామాలన్నీ గల్ఫ్ దేశాల కళ్లు తెరిపించాయి. అమెరికాకు స్వప్రయోజనాలు తప్ప తమ భద్రత గురించి పట్టదని వాటికి అర్థమైంది. సైనిక స్థావరాలకు అమెరికాను అనుమతించినప్పుడు గల్ఫ్ దేశాల ఆలోచన వేరు. ఆ స్థావరాలుంటే ఎవరూ తమవైపు కన్నెత్తిచూడబోరని అవి అమాయకంగా విశ్వసించాయి. కానీ తనపై దాడి జరిగినప్పుడల్లా ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో ఆ స్థావరాల సంగతటుంచి, తమ మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతున్నాయని గల్ఫ్ దేశాలు లబోదిబోమంటున్నాయి. ఈమధ్య మూడు సౌదీ కంపెనీలు షేర్ల జారీకి ప్రయత్నించి, తాజా దాడులతో ఆ ప్రతిపాదనను పక్కనబెట్టాయి. యూఏఈ శాఖను ప్రారంభించదల్చుకున్న ప్రముఖ సంస్థ విన్ రిసార్ట్స్ ఆ ఆలోచనకు స్వస్తి చెప్పింది. వివిధ ప్రభుత్వ విభాగాలకు ఖతార్ నిధులు కత్తిరించింది. ఎఫ్ 1 రేసులు, పలు సదస్సులు, వేలాదిమంది హాజరయ్యే దోహా ఫోరం, క్రిప్టో సదస్సు వంటివన్నీ ఆర్నెల్లుగా మూలనబడ్డాయి. రియల్ ఎస్టేట్ స్తంభించింది. వేలాదిమంది అమెరికన్లు వీటన్నిటా పెట్టుబడులు పెట్టి దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమ ఆర్థికవ్యవస్థల గురించి లేశమాత్రమైనా ఆలోచించకుండా ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు గల్ఫ్ దేశాలను కలవరపరుస్తోంది. అందుకే ఇప్పటికైనా ట్రంప్ తన పోకడలకు స్వస్తిచెప్పాలి.



# కైలాస మానస సరోవర్ యాత్ర:
# భక్తి మార్గంలో భద్రతకు పరీక్ష

## మార్గాలు వేరు... లక్ష్యం ఒక్కటే





డా. ముచ్చుకోట సురేష్ బాబు

కైలాస పర్వతం-మానస సరోవర్ యాత్ర ప్రపంచంలోని అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్రల్లో ఒకటిగా భావిస్తారు. హిందువులతో పాటు బౌద్ధులు, జైనులు, బోన్ సంప్రదాయాన్ని అనుసరించేవారికి కూడా కైలాస పర్వతం అత్యంత పవిత్రమైన క్షేత్రం. కైలాస పర్వతం చుట్టూ చేసే 'కోరా' లేదా ప్రదక్షిణ యాత్ర భక్తులకు ప్రధాన ఆధ్యాత్మిక అనుభూతిగా నిలుస్తుంది.పశ్చిమ టిబెట్‌లోని న్గారి ప్రాంతంలో ఉన్న కైలాస పర్వతం, మానస సరోవరం సముద్ర మట్టానికి 4,500 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి. అందువల్ల ఇది సాధారణ పర్యటన కాదు. తీవ్రమైన చలి, పలుచని గాలి, ఆక్సిజన్ కొరత, ఆకస్మిక వాతావరణ మార్పులు, కొండచరియలు, వరదలు వంటి ప్రమాదాలను ఎదుర్కొంటూ యాత్ర సాగించాల్సి ఉంటుంది.

**భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని రెండు ప్రధాన మార్గాలు**

భారతీయ పౌరులకు భారత ప్రభుత్వం నిర్వహించే కైలాస మానస సరోవర్ యాత్రకు ప్రధానంగా లిపులేఖ్ పాస్, నాథులా పాస్ మార్గాలు ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గతంలో ప్రచురించిన అధికారిక మార్గదర్శకాల ప్రకారం ఈ రెండు మార్గాల ద్వారా యాత్ర నిర్వహించబడుతుంది.

లిపులేఖ్ పాస్ మార్గం

ఢిల్లీ నుంచి అల్మోరా, పితోరాగఢ్, ధార్చులా మీదుగా లిపులేఖ్ పాస్ చేరుకుని టిబెట్‌లోకి ప్రవేశించే ఈ మార్గం సాంప్రదాయ యాత్రా మార్గంగా గుర్తింపు పొందింది.అధిక ఎత్తుల్లో సుదీర్ఘ ప్రయాణం, ట్రెక్కింగ్ ఈ మార్గానికి ప్రత్యేకత. లిపులేఖ్ పాస్ సుమారు 5,200 మీటర్ల ఎత్తులో ఉండటంతో యాత్రికులు శారీరకంగా, మానసికంగా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలి. ప్రభుత్వ యాత్రా మార్గదర్శకాల్లో ఢిల్లీ నుంచి అల్మోరా, ధార్చులా, సిర్ఖా, గాలా, బుధి, గుంజి, నాభిధాంగ్, లిపులేఖ్ మీదుగా టక్లాకోట్‌కు చేరుకునే దశలు వివరించబడ్డాయి. అనంతరం కైలాస-మానస సరోవర్ పరిసరాల్లో ప్రదక్షిణలు కొనసాగుతాయి.

**నాథులా పాస్ మార్గం**

సిక్కింలోని గాంగ్‌టక్ మీదుగా నాథులా పాస్ చేరుకుని టిబెట్‌లోని యాదోంగ్ ప్రాంతంలోకి ప్రవేశించే మార్గం మరో ముఖ్యమైన ప్రత్యామ్నాయం. లిపులేఖ్‌తో పోలిస్తే ఈ మార్గంలో రహదారి ప్రయాణానికి ఎక్కువ ప్రాధాన్యం ఉండటంతో సుదీర్ఘ నడక, ట్రెక్కింగ్ కొంత మేర తగ్గుతుంది.అయితే ఎత్తు, వాతావరణ పరిస్థితులు, సరిహద్దు ప్రాంతాల ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఇది కూడా తేలికైన యాత్రగా భావించరాదు.

**నమోదు నుంచి వైద్య పరీక్షల వరకు**

కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లే భారతీయులు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిక యాత్రా వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన యాత్రికులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు, శారీరక సామర్థ్య పరీక్షలు పూర్తి చేయాలి.ఎత్తైన ప్రాంతాల్లో ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉండటం వల్ల గుండె, ఊపిరితిత్తులు, రక్తపోటు వంటి సమస్యలు ఉన్నవారికి ప్రత్యేక జాగ్రత్త అవసరం. కేవలం భక్తి, ఆధ్యాత్మిక విశ్వాసం సరిపోదు; శారీరక సామర్థ్యం కూడా అత్యంత కీలకం.

**చైనా మార్గం: ల్హాసా మీదుగా లేదా నేరుగా న్గారి ప్రాంతానికి**

భారత ప్రభుత్వ అధికారిక మార్గాలతో పాటు చైనా భూభాగం మీదుగా కూడా యాత్రికులు కైలాస ప్రాంతానికి చేరుకునే మార్గాలు ఉన్నాయి. భారతదేశంలోని ప్రధాన నగరాల నుంచి చైనాలోని చెంగ్డూ, కున్మింగ్ వంటి నగరాలకు చేరుకుని అక్కడి నుంచి ల్హాసా మీదుగా కైలాస ప్రాంతానికి రోడ్డు మార్గంలో వెళ్లే విధానం ఒకటి.ల్హాసాలో కొంతకాలం ఉండటం వల్ల అధిక ఎత్తుకు శరీరం అలవాటు పడే అవకాశం ఉంటుంది. అనంతరం మానస సరోవరం, కైలాస పర్వత ప్రాంతానికి రోడ్డు ప్రయాణం కొనసాగుతుంది. అయితే ఈ విధానం ఎక్కువ సమయం తీసుకుంటుంది.మరోవైపు న్గారి గున్సా లేదా పురాంగ్ ప్రాంతాలకు విమాన మార్గం ద్వారా చేరుకుని అక్కడి నుంచి కైలాస-మానస సరోవర్ ప్రాంతానికి వెళ్లే విధానం ప్రయాణ సమయాన్ని తగ్గించవచ్చు. అయితే ఒక్కసారిగా అధిక ఎత్తుకు చేరుకోవడం వల్ల శరీరానికి అలవాటు పడే సమయం తగ్గుతుంది. అందువల్ల వేగం కంటే ఎత్తుకు శరీరం అలవాటు పడటానికి తగిన సమయం ఇవ్వడం ఆరోగ్యపరంగా ముఖ్యమైన అంశం.

**నేపాల్ మార్గం: సౌకర్యంతో పాటు పెరుగుతున్న ప్రమాదం**

ప్రజలకున్న భక్తి భావాన్ని అలాగే వాళ్ళ బలహీనతను డబ్బు రూపకంగా దండుకోవడానికి చాలా మంది టూరిస్ట్ ఆపరేటర్లు, ధార్మిక సంస్థలు కోట్లాది రూపాయలను దండుకొని వారి భద్రతను గాలికొదిలేశారు. ఒక భక్త బృందంలో 77 మంది జాడ ఇంతవరకు తెలియకపోవడం, కొందరు మృత్యువాత పడడం. వారిని సురక్షిత మార్గం ద్వారా కాకుండా ల్యాండ్ స్లైడ్, విధ్వంసం ఎక్కువగా ఉన్న రిస్క్ ఉన్న ప్రాంతం ద్వారా తీసుకెళ్లడం చేశారు. భారతదేశం నుంచి నేపాల్ మీదుగా కైలాస మానస సరోవర్‌కు వెళ్లే ప్రైవేట్ యాత్రా మార్గాలు కూడా చాలాకాలంగా ప్రాచుర్యంలో ఉన్నాయి. సాధారణంగా గోరఖ్‌పూర్, లక్నో వంటి ప్రాంతాల నుంచి నేపాల్‌లోకి ప్రవేశించి కాఠ్మాండూ మీదుగా సిమికోట్, హిల్సా లేదా గ్యిరోంగ్ సరిహద్దు ప్రాంతాల వైపు ప్రయాణం సాగుతుంది.హెలికాప్టర్, వాహనాలు, స్థానిక గైడ్లు, వైద్య బృందాలు వంటి సదుపాయాలను కొన్ని ప్రైవేట్ యాత్రా నిర్వాహకులు అందిస్తారు. అయితే ఈ మార్గంలో ప్రకృతి వైపరీత్యాల ప్రమాదాన్ని విస్మరించలేం.

**గ్యిరోంగ్ విషాదం చెప్పిన గుణపాఠం**

2026 ఆగస్టు 26న టిబెట్‌లోని గ్యిరోంగ్ ప్రాంతంలో సంభవించిన భారీ వరదలు, మట్టి-రాళ్ల ప్రవాహం కైలాస యాత్ర భద్రతపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తాయి. కైలాస యాత్ర నుంచి తిరుగు ప్రయాణంలో ఉన్న ఒక ఇషా ఫౌండేషన్ బృందంలోని 77 మంది యాత్రికులు గ్యిరోంగ్ ఇమ్మిగ్రేషన్ కేంద్రం వద్ద ఉన్న సమయంలో ఈ విపత్తు సంభవించిందని అప్పటి నివేదికలు వెల్లడించాయి. వారి ఆచూకీపై తీవ్ర ఆందోళన నెలకొంది. తర్వాతి నివేదికలు గ్యిరోంగ్ ప్రాంతంలో ఇమ్మిగ్రేషన్ భవనం భారీగా మట్టి, శిథిలాల కింద చిక్కుకుపోయిందని, సహాయక చర్యలు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కొనసాగాయని పేర్కొన్నాయి.సెప్టెంబర్ 2026 నాటికి ఈ విపత్తు తీవ్రత మరింత స్పష్టమైంది. రాయిటర్స్ నివేదిక ప్రకారం చైనా-నేపాల్ సరిహద్దులోని గ్యిరోంగ్ ప్రాంతం భారీ మట్టి ప్రవాహంతో ధ్వంసమైంది. చైనా వైపు 31 మరణాలు, 531 మంది గల్లంతైనట్లు అధికారులు పేర్కొనగా, గల్లంతైన వారిలో 23 దేశాలకు చెందిన 261 మంది విదేశీయులు ఉన్నట్లు సమాచారం. కైలాస యాత్రికులు కూడా వారిలో ఉన్నారు.ఈ ఘటన ఒక కీలకమైన విషయాన్ని స్పష్టం చేసింది.కైలాస యాత్ర ఎంత పవిత్రమైనదైనా, ప్రకృతి నియమాలకు అది అతీతం కాదు. ఆధ్యాత్మిక విశ్వాసం మనోధైర్యాన్ని ఇవ్వవచ్చు. కానీ వరదలు, కొండచరియలు, మంచు విరిగిపడటం, ఆక్సిజన్ కొరత వంటి భౌతిక ప్రమాదాలను మాత్రం శాస్త్రీయమైన భద్రతా చర్యలతోనే ఎదుర్కోవాలి.

**'దైవ రక్షణ' కంటే ముందుగా భద్రత**

కైలాస యాత్రను నిర్వహించే సంస్థలు, టూర్ ఆపరేటర్లు యాత్రికులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతో పాటు భద్రతా ప్రమాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.ఎత్తైన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సదుపాయాలు, ఆక్సిజన్ సరఫరా, శాటిలైట్ కమ్యూనికేషన్, వాతావరణ హెచ్చరికలు, ప్రత్యామ్నాయ మార్గాలు, స్థానిక రక్షణ బృందాలతో సమన్వయం వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ముఖ్యంగా విపత్తు సంభవించినప్పుడు యాత్రికుల ఖచ్చితమైన సంఖ్య, వారి చివరి లొకేషన్, పాస్‌పోర్ట్ వివరాలు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించే వ్యవస్థ స్పష్టంగా ఉండాలి.యాత్రికుల నుంచి అధిక మొత్తంలో రుసుము వసూలు చేసే సంస్థలు తమ సేవలు, భద్రతా ఏర్పాట్లు, స్థానిక ఆపరేటర్లకు చెల్లించే మొత్తాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకునే చర్యలపై పారదర్శకత పాటించాలి.

**ఆధ్యాత్మిక యాత్రకు శాస్త్రీయ ప్రణాళిక అవసరం**

కైలాస మానస సరోవర్ యాత్ర భక్తికి సంబంధించినదే అయినప్పటికీ, అది అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో జరిగే ప్రయాణం. అందువల్ల యాత్రికులు మార్గాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు కేవలం ఖర్చు, సమయం, సౌకర్యం మాత్రమే కాకుండా వాతావరణ పరిస్థితులు, ఎత్తు, వైద్య సదుపాయాలు, అత్యవసర రక్షణ వ్యవస్థలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. లిపులేఖ్, నాథులా వంటి భారత ప్రభుత్వ మార్గాలు అధికారిక వ్యవస్థలో నిర్వహించబడుతున్నందున వాటి ఎంపికకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. మరోవైపు నేపాల్ లేదా చైనా మీదుగా ప్రైవేట్ యాత్రలను ఎంచుకునే వారు నిర్వాహక సంస్థ విశ్వసనీయత, అనుమతులు, బీమా, వైద్య సదుపాయాలు, అత్యవసర తరలింపు వ్యవస్థలను తప్పనిసరిగా పరిశీలించాలి.కైలాస పర్వతం భక్తికి ప్రతీక కావచ్చు. మానస సరోవరం ఆధ్యాత్మిక ప్రశాంతతకు చిహ్నం కావచ్చు. కానీ అక్కడికి చేరే మార్గం మాత్రం అత్యంత కఠినమైనది. ఈ యాత్ర మనకు చెప్పే ముఖ్యమైన పాఠం ఒక్కటే—భక్తి మనిషిని ముందుకు నడిపిస్తుంది; కానీ భద్రతా ప్రణాళిక అతడిని సురక్షితంగా ఇంటికి తీసుకువస్తుంది.కైలాస యాత్రను ఇకపై కేవలం ఆధ్యాత్మిక యాత్రగా కాకుండా, భక్తి, బాధ్యత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రకృతి పట్ల గౌరవం కలిసిన సమగ్ర యాత్రగా చూడాల్సిన అవసరం ఉంది.

# ఎల్ఐసీ.. ఎదురులేని ప్రస్థానం!

**దేశీయ పొదుపును ప్రోత్సహించడం, ప్రజల పొదుపునకు భద్రత కల్పించడం, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని సామాజిక బాధ్యతగా అందించడం వంటి లక్ష్యాలతో స్వాతంత్ర్యానంతరం ఎల్ఐసీ ఏర్పాటైంది. ప్రభుత్వ తరఫున సార్వభౌమ హామీ కల్పిస్తూ, ప్రీమియం రూపంలో ప్రజల పొదుపును సమీకరించడం, ప్రైవేటు వ్యక్తుల మోసాల బారి నుంచి ప్రజల సొమ్మును పరిరక్షించడం ద్వారా ఆర్థిక రంగంలో ఎల్ఐసీ ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. సెప్టెంబర్ 1వ తేదీన 70వ సంస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఇన్సూరెన్స్ దిగ్గజం.. ప్రభుత్వరంగ 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' దేశానికే గర్వకారణం. ఎల్ఐసీ సంస్థాపక దినోత్సవం సందర్భంగా, దేశ ఆర్థిక రంగంలో ఈ సంస్థ నిర్వహించిన కీలకపాత్రను మననం చేసుకోవడం ముదావహం.**

ప్రజల వద్ద నుంచి 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రీమియం రూపంలో వసూలు చేసిన మొత్తాలను తమ సొంత ప్రయోజనాలకు వాడుకుంటూ పాలసీదారులను మోసం చేస్తున్న నేపథ్యంలో అన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను కలిపి భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని నాడు జాతీయం చేశారు. ఏ లక్ష్యాలతో అయితే భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేసి 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'గా ఏర్పాటు చేశారో... ఆ జాతీయాకరణ లక్ష్యాలను సాధించటంలో ఎల్ఐసీ కృతకృత్యమైంది.

సెప్టెంబర్ 1, 1956న పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పడిన ఎల్ఐసీ.. గత డెబ్బై ఏళ్లుగా దేశీయ ఆర్థిక రంగానికి వెన్నెముకగా నిలుస్తోంది. ఆర్థికరంగ అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయలను పెట్టుబడులుగా ఉంచింది. ఎల్ఐసీ మొత్తం పెట్టుబడులలో 82శాతం గవర్నమెంట్ సెక్యూరిటీలుగా, దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్దేశించినవే.

1956లో కేవలం 5 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై.. 2011లో 'ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ' నియమాల ప్రకారం 100 కోట్లు పెట్టుబడిగా మార్పుచేసుకుంది. 'ప్రజల సొమ్ము ప్రజల శ్రేయస్సుకే' అనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14.57 లక్షల మంది ఏజెంట్స్‌తో పటిష్ఠమైన మార్కెటింగ్ నెట్‌వర్క్‌తో వివిధ స్థాయిలలో 3,836 ప్రాంతాలకు తన కార్యాలయాలను విస్తరింపజేసింది. 25 కోట్లకు పైగా వ్యక్తిగత పాలసీదారులను, 10 కోట్లకు పైగా గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీదారులను కలిగి ఉంది.

సెబీ నిబంధనల ప్రకారం, 10 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ కలిగి ఉండాలనే సాకు చూపి, 'ఆఫర్ ఫర్ సేల్' (ఓఎఫ్ఎస్) పేరుతో, ఎల్ఐసీ 1:1 బోనస్ షేర్లను జారీ చేసిన అనంతరం మరొక 6.5శాతం ప్రభుత్వ వాటాను ఉపసంహరించారు. ఈ ఓఎఫ్ఎస్ 3.32 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యి.. 31,552 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమయ్యాయి. ఎల్ఐసీపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని ప్రభుత్వం అమ్ముకోవడం సర్వత్రా విమర్శలకు దారితీసింది.

ప్రతికూల స్టాక్ మార్కెట్ పరిణామాల నేపథ్యంలో ఎల్ఐసీ షేర్లు, విలువ తగ్గి డిస్కౌంట్‌తో ట్రేడై మదుపరులను నిరుత్సాహపరిచిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇది మొత్తం స్టాక్ మార్కెట్ ట్రెండ్‌లో భాగంగా జరిగిన పరిణామమైనప్పటికీ ఈ ప్రక్రియ ఎల్ఐసీ ప్రతిష్ఠకు భంగం కలిగించింది. ఎల్ఐసీ షేరుకు స్టాక్ మార్కెట్‌లో ఉన్న విలువ కన్నా, ఆ సంస్థ అంతర్గత విలువ అనేక రెట్లు అధికమనేది అంగీకరించాల్సిన అంశం. ఎల్ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 63.7 బిలియన్ డాలర్లుగా నమోదుచేసి, దేశంలోని అత్యధిక క్యాపిటలైజేషన్ కలిగిన కంపెనీల జాబితాలో పదో స్థానంలో నిలిచింది.

స్టాక్ మార్కెట్‌లో ఎల్ఐసీ షేరు విలువ తీరుకు, వాస్తవ ఎల్ఐసీ వ్యాపార పనితీరుకు అంతరం ఉంది. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో పోల్చినపుడు ఈ సంస్థ పనితీరు మెరుగ్గా ఉంది. ఎల్ఐసీ నిర్మాణశైలి షేర్ విలువ లాభాలకన్నా, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన అంశాలతో ముడిపడి ఉంటుంది.

కేవలం నష్టాలలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ, వాటాల ఉపసంహరణ చేస్తామని పేర్కొనే ప్రభుత్వం, దీనికి భిన్నంగా ప్రతిష్ఠాత్మకమైన ఫార్చ్యూన్-500 కంపెనీల జాబితాలో నిలిచి దేశానికే వన్నెతెచ్చిన ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థ ఎల్ఐసీ వాటాలను అమ్ముకుని బడ్జెట్ లోటును పూడ్చుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడాన్ని పౌర సమాజం హర్షించదు.

2047 నాటికి ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్‌ను అందించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన ప్రస్తుత తరుణంలో, ఆదాయ అంతరాలను తగ్గిస్తూ, ప్రజలకు సామాజిక భద్రతను కల్పిస్తూ, రాజ్యాంగ పీఠిక ప్రబోధించిన సమానత్వం, సార్వభౌమత్వం అనే కీలక అంశాలే ప్రాతిపదికగా, అద్భుత పనితీరుతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన, దేశ ఆర్థిక వ్యవస్థకు అమృత తుల్యమైన ఎల్ఐసీ వంటి ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థను డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రభుత్వ వాటాలను అమ్ముకోవడం ప్రజామోదయోగ్యం కాదు.

# గిరిజనులకు మేలు చేయని 1/70

**షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనులు స్వేచ్ఛగా జీవించడానికి, వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆస్తులు, జీవన విధానాన్ని పరిరక్షించడానికి 1/70 చట్టాన్ని తీసుకువచ్చారు. కానీ ఈ యాభయ్యేళ్లలో అది గిరిజనులకు ఏ మేరకు ఉపయోగపడింది అన్నది ఇంకా ప్రశ్నగానే మిగిలి ఉన్నది. 1970 తర్వాత ఈ చట్టం గిరిజనులకు ఒక్క ఎకరం భూమినైనా పెంచగలిగిందా? అన్న ప్రశ్నకు మనం జవాబు ఆలోచించాలి. 1970 తర్వాత అడవిని కొట్టి కొత్తగా సాగులోకి తెచ్చుకున్న భూమిని పక్కనపెడితే, ఈ అయిదు దశాబ్దాల్లో గిరిజనేతరుల నుంచి చట్టబద్ధమైన క్రయవిక్రయాల ద్వారా గిరిజనులకు కొత్తగా సంక్రమించిన భూమి చాలా తక్కువ. అదే సమయంలో గిరిజనేతరుల మధ్య, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, ఒప్పందాలు, ఇతర మార్గాల ద్వారా పెద్ద ఎత్తున భూ లావాదేవీలు జరిగాయన్నది వాస్తవం. ఈ వ్యవహారాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్రమంగా పెద్ద ఎత్తున సంపాదించుకున్నారన్నది బహిరంగ రహస్యం.**

౧/70 చట్టం ఒకవైపు గిరిజన భూములు గిరిజనేతరులకు వెళ్లకుండా అడ్డుకున్నది నిజమే కానీ, మరోవైపు గిరిజన రైతు తన భూమికి అవసరమైన సమయంలో సరైన విలువ పొందడానికి అడ్డంకిగా మారింది. గిరిజనుల భూమిని రక్షించాల్సిన 1/70 చట్ట సవరణ, అమలులో మాత్రం గిరిజన రైతుల ఆర్థిక స్వేచ్ఛకే పరిమితులు విధించే వ్యవస్థగా మారింది.

పక్కనే 1/70 అమలు కాని మండలాల్లో వ్యవసాయ భూమి ఎకరానికి రూ.40-50 లక్షల వరకు విలువ పలికే పరిస్థితులు ఉన్నప్పుడు, 1/70 చట్ట పరిధిలోని ప్రాంతాల్లో అదే స్థాయి భూమి విలువ రూ.10 లక్షల లోపే ఉంది, అదే గిరిజనుల భూమి అయితే అంతకంటే తక్కువే. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి భూమి బదలాయింపుపై ఉన్న చట్ట పరమైన ఆంక్షలు. అయితే తక్కువ ధరకు భూమి దొరుకుతుంది కదా అని ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఆర్థికంగా మంచి స్థితికి చేరిన గిరిజనులు సైతం 1/70 ఏరియాలో భూములు కొనడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. భవిష్యత్తులో అవసరం వచ్చినప్పుడు తాము కొనుగోలు చేసిన భూమిని తిరిగి అమ్ముకోలేమనే భయమే దానికి కారణం. ఇది గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛపై తీవ్రమైన చర్చకు దారితీసే అంశం.

వ్యవసాయ భూమి రైతుకు కేవలం జీవనాధారం మాత్రమే కాదు. అది కుటుంబానికి ఆధారం. తమ ముందు తరతరాలకు ఆధారం. కష్టకాలంలో ఆర్థిక భద్రత. పిల్లల భవిష్యత్తుకు భరోసా. వ్యాపారం చేయడానికి పెట్టుబడి. అవసరమైనప్పుడు ఆర్థిక అభివృద్ధిలో ఒక అడుగు ముందుకు వేయడానికి మూలధనం. అలాంటి పరిస్థితిలో ఒక గిరిజన లేదా గిరిజనేతర రైతు తను సొంతంగా సంపాదించిన లేదా వారసత్వంగా వచ్చిన భూమిని తన అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే లేదా, వారసులకు అందించే విషయంలో ఈ చట్టం గిరిజన/గిరిజనేతరుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుంది, స్వేచ్ఛాయుత క్రయవిక్రయాల నిషేధం ఏ విధంగా న్యాయ సమ్మతం?

గిరిజన ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు లేకుండా చేయడం, ఉపాధి అవకాశాలు రాకుండా చేయడం, భూమిని ఆర్థిక ఆస్తిగా వినియోగించుకునే మార్గాలను పూర్తిగా మూసివేయడం ద్వారా గిరిజనులను అభివృద్ధి చేశామని ప్రభుత్వాలు భావిస్తే, దానికంటే శోచనీయమైన విషయం మరొకటి ఉండదు. రక్షణ అంటే అభివృద్ధిని అడ్డుకోవడం కాదు; గిరిజనుడి హక్కును కాపాడుతూ, అతనికి అభివృద్ధి అవకాశాలను కల్పించడం.

గిరిజనుల భూమిని కాపాడటమన్న 1/70 చట్టం ఉద్దేశాన్ని ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ 55 సంవత్సరాల తర్వాత మారిన పరిస్థితులకు అనువుగా ఈ చట్టాన్ని సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. ఈ చట్టం గిరిజనుల భూమిని ఎంతవరకు కాపాడింది? గిరిజనుల ఆర్థిక స్థితిని ఎంతవరకు మెరుగుపరిచింది? వారి భూమి విలువను ఎంత పెంచింది? భూ బదలాయింపుపై ఆంక్షల వల్ల గిరిజనులకు జరిగిన మంచీ చెడూ ఏమిటి? ఈ అంశాలన్నిటిపైనా లోతైన సమీక్ష జరగాలి. గిరిజనుల భూమిని రక్షించాలి. అదే సమయంలో గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛను కూడా రక్షించాలి.



# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

సోమవారం | అనంతపురం | 07.09.2026 | 01


## నేడు రేవెన్యు భవన్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- అర్జీలను "meekosam.ap.gov.in" వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చు
- అర్జీల పరిష్కార సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు
- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

పుట్టపర్తి,సెప్టెంబర్ 06:అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్. ఆర్. శంకరన్ హాల్) లో రేపు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుంది.ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ నెల 7న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

# పొగాకు రైతులకు భరోసా..

## మార్కెట్లో మెరుగైన పరిస్థితులు

- నో-బిడ్'లు తగ్గుముఖం.. కొనుగోలుదారుల పోటీతో మెరుగవుతున్న ధరలు
- వచ్చే ఏడాది పంట నియంత్రణతో - మార్కెట్కు అనుగుణంగా ఉత్పత్తి
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా చర్యలు
- వేలం కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్



ఆంధ్రప్రదేశ్లో 2025-26 FCV పొగాకు వేలాల్లో ఇటీవల మార్కెట్ పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు, మార్గదర్శకత్వంతో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను కూడా పొగాకు వేలం ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల FCV పొగాకు మార్కెట్ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్కు అనుమతించబడిన పంట పరిమాణం 142 మిలియన్ కిలోలు కాగా, అంచనా ఉత్పత్తి సుమారు 236 మిలియన్ కిలోలుగా ఉందన్నారు. ఇప్పటివరకు నమోదైన సగటు ధర కిలోకు రూ.209.83గా ఉందని వెల్లడించారు. గత ఏడాది ఇదే 132 వేలం రోజుల నాటికి 140.27 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ కాగా, తుది సగటు ధర కిలోకు రూ.248.86గా నమోదైందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్లో సర్ప్లస్ ఏర్పడటంతో కొంత ఒత్తిడి నెలకొన్నప్పటికీ, ఇటీవల వేలాల్లో కొనుగోలుదారుల స్పందన, పోటీ గణనీయంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు.

**తగ్గుతున్న 'నో-బిడ్'లు.. పెరుగుతున్న కొనుగోలుదారుల పోటీ**

ఇటీవల వేలం కేంద్రాల్లో 'నోబిడ్' బేల్స్ శాతం గణనీయంగా తగ్గిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా సగటున 11-12 శాతం వరకు 'నోబిడ్'లు నమోదవుతున్నాయని, కొన్ని వేలం ప్లాట్ఫారమ్లలో ఇది 1-2 శాతం కంటే కూడా తక్కువగా ఉందన్నారు. 'నోబిడ్'లు తగ్గడం, కొనుగోలు కార్యకలాపాలు పెరగడం, కొనుగోలుదారుల మధ్య పోటీ మెరుగుపడటం మార్కెట్లో సానుకూల సంకేతాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం వారానికి సుమారు 10 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ అవుతోందని తెలిపారు. కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న పోటీ మెరుగైన ధరల సాధనకు దోహదపడుతోందన్నారు.

**కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ధరలు**

వివిధ వేలం ప్రాంతాల్లో కూడా మార్కెట్ పరిస్థితులు మెరుగుపడుతున్నాయని మంత్రి తెలిపారు. NLS ప్రాంతంలో అత్యధికంగా కిలోకు రూ.329 వరకు ధర లభించిందన్నారు. SLSలో అత్యధిక బిడ్ రూ.255, SBSలో రూ.252గా నమోదైందని వెల్లడించారు. డిమాండ్ ఉన్న గ్రేడ్లు, రకాల పొగాకుకు ప్రస్తుతం మార్కెట్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. గత నెల రోజులుగా SLS, SBS ప్రాంతాల్లో కొనుగోలు వేగం, ధరల సాధన వేలం ప్రారంభ దశతో పోలిస్తే మెరుగుపడ్డాయని చెప్పారు.

**రైతుల ప్రయోజనాల కోసం నిరంతర పర్యవేక్షణ**

పొగాకు పంట మార్కెటింగ్ ప్రక్రియను టొబాకో బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులతో సమన్వయం చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామన్నారు. వేలాల్లో కొనుగోలుదారులు నిరంతరం పాల్గొనేలా చూడటం, మార్కెటబుల్ పొగాకును కొనుగోలు చేయడం, నివారించగల 'నోబిడ్'లను తగ్గించడం, కొనుగోలు షెడ్యూల్ను క్రమబద్ధంగా కొనసాగించడం, పంటను త్వరితగతిన మార్కెట్ చేయడం వంటి అంశాలపై వ్యాపార వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులు వేలం ప్లాట్ఫారమ్లను సందర్శిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని మంత్రి వివరించారు.

**వచ్చే ఏడాది పంట పరిమాణం భారీగా తగ్గింపు**

ప్రస్తుత సీజన్లో అనుమతించబడిన పంట పరిమాణం, వాస్తవ ఉత్పత్తి మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో మార్కెట్లో అధిక పరిమాణంలో పొగాకు అందుబాటులోకి వచ్చిందని అచ్చెన్నాయుడు తెలిపారు. దీనివల్ల మార్కెట్పై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని 2026-27 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్లో FCV పొగాకు అనుమతించబడిన పంట పరిమాణాన్ని 142 మిలియన్ కిలోల నుంచి 81 మిలియన్ కిలోలకు తగ్గించినట్లు మంత్రి తెలిపారు. మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం, భవిష్యత్తులో అధిక మార్కెటబుల్ సర్ప్లస్ ఏర్పడకుండా చూడటం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమన్నారు. వచ్చే ఏడాది రైతులు అనుమతించబడిన పంట పరిమాణానికి మాత్రమే పరిమితమై సాగు చేసేలా టొబాకో బోర్డు ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన మార్గదర్శకత్వంలో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, న్యాయమైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. వేలం ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## ఈనెల 8, 9వ తేదీల్లో సొల్ల బొజ్జిరెడ్డి జిల్లా పర్యటన..

- ఛైర్మన్ తో పాటు 5 మంది సభ్యులు పి..వెంకటప్ప, జి.సునీత, కె.లక్ష్మి, కె.సాయిరాం, కె.మల్లేశ్వరరావు జిల్లాకు రాక..
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, సెప్టెంబర్ 06 :అనంత జనశక్తి న్యూస్

ఈనెల 8, 9వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ తో పాటు 5 మంది సభ్యులు జిల్లాకు వస్తున్నారన్నారు.ఛైర్మన్ తో పాటు సభ్యులు 1.పి.వెంకటప్ప, 2.జి.సునీత, 3.కె.లక్ష్మి, 4.కె.సాయిరాం, 5.కె.మల్లేశ్వరరావు జిల్లాకు వస్తున్నారని తెలిపారు.ఈనెల 8వ తేదీన రాత్రి షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ ఛైర్మన్, సభ్యులు అనంతపురములోని ఆర్&బి గెస్ట్ హౌస్కు చేరుకుని రాత్రికి బస చేస్తారు. ఈనెల 9వ తేదీన ఉదయం 08.30 నుండి ఉదయం 09.30 గంటల వరకు గిరిజన నాయకులు, గిరిజన సంఘాలు మరియు గిరిజనులతో అర్జీలను స్వీకరిస్తారు. ఉదయం 09.30 గంటలకు ఆర్&బి గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 09:45 గంటలకు అనంతపురం నగరంలోని ఏకలవ్య విగ్రహం వద్దకు చేరుకుని, అక్కడ 10 గంటల వరకు ఏకలవ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించడం చేస్తారు. ఉదయం 10 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 10:45 గంటలకు పామిడి మండలం పాలెం తండా రోడ్డుకు చేరుకుంటారు. ఉదయం 10:45 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు పామిడి మండలం, పాలెం తాండా గిరిజన ప్రజలతో సంభాషణ మరియు సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 02:00 గంటలకు పామిడి మండలం, పాలెం తాండా నుంచి బయలుదేరి అనంతపురం కలెక్టరేట్ కు చేరుకుంటారు. అనంతపురం కలెక్టరేట్ లో మధ్యాహ్నం 02:30 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు జిల్లా కలెక్టర్, ఎస్.పిలతో పాటు జిల్లా స్థాయి అధికారులందరితో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 05:00 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలుదేరి అనంతపురము ఆర్&బి గెస్ట్ హౌస్కు చేరుకుంటారు.

## అనంతపురం అర్బన్ బ్యాంక్ 110వ మహాజనసభ ఘనంగా నిర్వహణ




- బ్యాంక్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం : ఛైర్మన్ డా|| జె.ఎల్. మురళీధర్

అనంతపురం సెప్టెంబర్ 06,అనంత జనశక్తి న్యూస్

అనంతపురం అర్బన్ బ్యాంక్ 110వ మహాజనసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ డా|| జె.ఎల్. మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ..అనంతపురం అర్బన్ బ్యాంక్ 110 సంవత్సరాలుగా ప్రజల నమ్మకాన్ని చూరగొని విజయవంతంగా కొనసాగుతుండటం ఎంతో గర్వకారణమని అన్నారు. బ్యాంక్ అభివృద్ధిలో సభ్యులు, ఖాతాదారులు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు.ఖాతాదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. బ్యాంక్ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు సభ్యుల సంక్షేమం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు విస్తరించడమే తమ లక్ష్యమని అన్నారు.అనంతపురం అర్బన్ బ్యాంక్ ప్రజల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, భవిష్యత్తులో కూడా మరింత ప్రగతి సాధించే దిశగా పాలకవర్గం, సిబ్బంది సమిష్టిగా పనిచేస్తారని ఛైర్మన్ తెలిపారు.ఈ మహాజనసభలో బ్యాంక్ వైస్ ఛైర్మన్లు చింతల భాస్కర్, జంగంశెట్టి రామాంజినేయులు డైరెక్టర్లు సుబ్రమణ్యం, కృష్ణ కుమార్, బావిగడ్డ రమణయ్య, గోల్డ్ భాష, మాగిశెట్టి చంద్ర శేఖర్, వెంకటాద్రి, రోల్ల భాస్కర్, అనీల్ నాయుడు, పుళ్ళప్ప, గిరీష్, బి.ఓ.ఎం మెంబర్లు విజయ్ భాస్కర్, సునీల్ రాయల్, సందర్శ్ బ్యాంక్ సీఈఓ నవీన్, మేనేజర్లు ఖాజా, మేఘన, రాధ, హేమా, రాము, సతీష్, చంద్రశేఖర్ బ్యాంక్ సిబ్బంది మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్యాంక్ వార్షిక నివేదిక, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- భక్తులను ఆకట్టుకున్న 1008 సిద్ధలింగ రాజదేశి కేంద్ర శివాచార్యుల ఆధ్యాత్మిక ప్రవచనం
- శివధ్యాన మందిరాన్ని ప్రారంభించిన సినీ నటుడు శ్రీకాంత్

కళ్యాణదుర్గం సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్




దైనందిన జీవితంలో ఆధునిక ఒత్తిళ్ల మధ్య మానవుడు మానసిక ప్రశాంతతను కోల్పోతున్నాడని, ఆధ్యాత్మిక చింతన, ధ్యానం, సత్ప్రవచనాలను ఆలకించి వాటిని జీవితంలో ఆచరణలో పెట్టడం ద్వారా మనశ్శాంతితో పాటు దైవానుగ్రహాన్ని పొందవచ్చని శ్రీశ్రీశ్రీ మద్ ఉజ్జయిని సద్ధర్మ సింహాసనాధీశ్వరులు, 1008 సిద్ధలింగ రాజదేశి కేంద్ర శివాచార్య స్వాములు భక్తులకు ఉద్బోధించారు.

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఆదివారం శివధ్యాన మందిరం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 40 అడుగుల వాయు లింగాల ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శివతత్వం, ధ్యానం, ఆధ్యాత్మిక జీవన విధానం గురించి సాగిన ప్రవచనాలు భక్తుల్లో భక్తిభావాన్ని నింపాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ హాజరై నూతనంగా నిర్మించిన శివధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం జయనగర్ కాలనీలోని శివధ్యాన మందిరం నుంచి మార్కెట్ యార్డు వరకు బ్రహ్మకుమారీలు, విద్యార్థులు, భక్తులు ఆధ్యాత్మిక సందేశాలతో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభలో 1008 సిద్ధలింగ రాజదేశి కేంద్ర శివాచార్య స్వాములవారు మాట్లాడుతూ.. మనిషి ఎంత సంపద, సౌకర్యాలు సంపాదించినా అంతరంగంలో ప్రశాంతత లేకపోతే జీవితం సంపూర్ణం కాదన్నారు. ధ్యానం, ఆధ్యాత్మిక చింతన, సత్ప్రవర్తన, దైవస్మరణ ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని సూచించారు. భక్తి అనేది కేవలం ఆచారం మాత్రమే కాదని, మన ఆలోచనలు, మాటలు, చేతల్లో ప్రతిఫలించాల్సిన జీవన విధానమని తెలిపారు.

సినీ నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. తాను కర్ణాటకలోని గంగావతిలో జన్మించానని, సినీ అవకాశాల కోసం హైదరాబాద్కు వెళ్లినప్పటికీ తన తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న ఆధ్యాత్మిక సందేశాలను ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ద్వారా జీవితంలో ఆచరణలో పెడుతున్నానని తెలిపారు. ఆధ్యాత్మికత మనిషికి అంతర్గత బలాన్ని, సానుకూల ఆలోచనలను, మానసిక ప్రశాంతతను అందిస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శివధ్యాన మందిరం వద్ద సినీ నటుడు శ్రీకాంత్ను శాలువాతో సన్మానించి అభినందించారు.వేడుకల్లో వందలాది మంది బ్రహ్మకుమారీలు, పాఠశాల విద్యార్థులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలను ఆలకించారు.భరతనాట్యం, శివనామ స్మరణతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం ఆద్యంతం శివనామస్మరణ, ధ్యానం, ఆధ్యాత్మిక సందేశాలతో భక్తిమయంగా కొనసాగింది. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో సీఐ హరినాథ్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.కార్యక్రమంలో నిర్వాహకులు కమలాక్షి అక్కయ్య, జ్యోతి అక్కయ్య, నిర్మల అక్కయ్య, వీణ అక్కయ్య, శకుంతల అక్కయ్య, బ్రహ్మకుమారి నిర్మల అక్కయ్య, విజయ అక్కయ్య, శివప్రసాద్, తిమ్మారెడ్డి, రిటైర్డ్ ఎస్సై కుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- ఈనెల 07వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ
- సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..
- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100" అనే బ్యానర్ను ఏర్పాటు చేయాలి
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, సెప్టెంబర్ 06 : అనంత జనశక్తి న్యూస్



మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100" అనే బ్యానర్ను ఏర్పాటు చేయాలన్నారు.

**ఈనెల 07వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :**

ఈనెల 07వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

## 8వ తేదీన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి రాక

- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి , సెప్టెంబర్ 06 :అనంత జనశక్తి న్యూస్



ఈనెల 8వ తేదీన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటిస్తున్నారని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ తో పాటు 5 మంది సభ్యులు జిల్లాకు వస్తున్నారన్నారు.ఛైర్మన్ తో పాటు సభ్యులు పి.వెంకటప్ప, జి.సునీత, కె.లక్ష్మి, కె.సాయిరాం, కె.మల్లేశ్వరరావు జిల్లాకు వస్తున్నారని తెలిపారు.ఈనెల 7వ తేదీన రాత్రి షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ ఛైర్మన్, సభ్యులు కదిరిలోని ఆర్&బి గెస్ట్ హౌస్కు చేరుకుని రాత్రికి బస చేస్తారు.

**పర్యటన వివరాలు...**

నల్లచెరువు మండలంలోని బలేపల్లి తండా, ముదిగుబ్బ మండలంలోని సానేవారిపల్లి ఎస్టీ కాలనీ మరియు గరుగు తండాలను సందర్శించి గిరిజనుల సమస్యలను పరిశీలిస్తారు.మధ్యాహ్నం 12:00 గంటలకు కదిరి R&B గెస్ట్ హౌస్లో గిరిజన నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ఉద్యోగుల సంఘాల నాయకులు మరియు ప్రజలతో సమావేశమై అర్జీలను స్వీకరిస్తారు.గిరిజన ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలని కోరడమైనది

# అనంతలో ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ సెప్టెంబర్ 19 నుంచి



- ఐపీఎల్ తరహాలో కలర్ డ్రెస్సులతో క్రికెట్ టోర్నీ
- ఎంప్లాయిస్ క్రికెట్ లీగ్ ప్రారంభం
- ఈనెల 13 లోపు ఎంట్రీలు ఇవ్వాలి
- మచ్చా రామలింగారెడ్డి
- అధ్యక్షులు ఏపీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్

**అనంతపురం సెప్టెంబర్ 06,అనంత జనశక్తి న్యూస్**

ఏపీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ అనంతపురం నగరంలోని ఆర్డిటి మైదానం నందు సెప్టెంబర్19 నుండి ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షులు వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మచ్చా రామలింగారెడ్డి తో పాటు ఉపాధ్యక్షుడు శ్రీధర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కే విజయరాజు సభ్యుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు ఐపీఎల్ తరహాలో ఉద్యోగస్తులకు ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ అనంతపురం పేరుతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని, మచ్చ రామలింగారెడ్డి తెలిపారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాలలో గల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగస్తులు ఈ టోర్న మెంట్లో పాల్గొనవచ్చు.పాల్గొనే ఉద్యోగస్తులకు కలర్ టీ షర్ట్ లు అందజేయడం జరుగుతుందని,మచ్చ రామలింగారెడ్డి తెలిపారు . ప్రతి డిపార్ట్మెంట్ ఈ టోర్నమెంట్లో పాల్గొనవచ్చునని ఆ డిపార్ట్మెంట్ హెడ్ తో సంతకాలతో ఎంట్రీ ఫార్మ్స్ పంపించాలని తెలిపారు. ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ లో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు ఈనెల సెప్టెంబర్ 13 లోపు ఉద్యోగస్తులు ఎంట్రీలు ఇవ్వాలని మచ్చ రామలింగారెడ్డి కోరారు. ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ లో టీచర్లు రెవెన్యూ, పంచాయతీరాజ్, జ్యుడీషియల్,అన్ని శాఖల వారు పాల్గొని విజయవంతం చేయాలని మచ్చ రామలింగారెడ్డి కోరారు ఈనెల 13వ తారీకు లోపు అనంతపురం నగరంలోని కమలానగర్ లో గల అంకుశం పత్రిక కార్యాలయం నందు,సప్తగిరి సర్కిల్లో అందజేయాలని మచ్చ రామలింగారెడ్డి కోరారు. ఇతర వివరాలకు సంప్రదించవచ్చును కె. విజయ రాజు * ఆర్గనైజింగ్ సెక్రటరీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ .
సెల్ ఫోన్ నెంబర్ 9490062555

# ఈరన్న స్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని రూ.4 లక్షల విరాళం



- పార విశ్వనాథ్ రూ.2 లక్షల ఆర్థిక సహాయం.. టీటీడీ నుంచి నిధులు తీసుకొస్తాం: ఎమ్మెల్యే అమిలినేని

**కుందుర్పి సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం కరిగానిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఈరన్న స్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు రూ.4 లక్షల స్వంత నిధులను అందజేశారు. పెరవలి పార విశ్వనాథ్ రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నుంచి కూడా నిధులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, పార విశ్వనాథ్‌లను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# శివ ధ్యాన మందిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అమిలినేని, సినీ నటుడు శ్రీకాంత్

* 25వ రజతోత్సవం సందర్భంగా ఘనంగా ప్రారంభోత్సవం

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

**అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలోని ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 25వ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన శివ ధ్యాన మందిరాన్ని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం 25వ రజతోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన మందిరంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ధ్యానం, ఆధ్యాత్మికత ద్వారా మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.**



# అవార్డు కాదు... బాధ్యతకు కొలమానం...!!

- రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా శ్రీనివాసులకు అరుదైన గౌరవం
- బోధనలో అంకిత భావానికి రాష్ట్ర ప్రభుత్వం పట్టం... ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడికి ప్రతిష్టాత్మక పురస్కారం.
- సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న శ్రీనివాసులు.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్:**



బోధనను కేవలం ఉద్యోగంగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతగా భావిస్తూ అంకితభావంతో సేవలందిస్తున్న ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు శ్రీనివాసులు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకోవడం విశేషం.

రసాయనశాస్త్ర బోధనలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధానాలను అనుసరిస్తూ, వారి విద్యా ప్రగతికి నిరంతరం కృషి చేస్తున్న శ్రీనివాసుల సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేసింది. ఈ పురస్కారం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించడంతో పాటు, ఇకపై మరింత బాధ్యతతో పనిచేయాల్సిన స్ఫూర్తిని అందించిందని శ్రీనివాసులు పేర్కొన్నారు.తనకు ఈ అవార్డు వస్తుందని
ఊహించలేదని, ఉపాధ్యాయుడిగా తాను అందిస్తున్న సేవలకు లభించిన ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. విద్యార్థులలో ప్రతిభను వెలికితీసి, ఉన్నత శిఖరాలకు చేర్చడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా శ్రీనివాసులు అవార్డు అందుకోవడంతో ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం ధర్మవరం విద్యా రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు.

# పలు వివాహాది శుభ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి సెప్టెంబర్ 06,అనంత జనశక్తి న్యూస్**

కదిరి నియోజకవర్గంలో శ్రేయోభిలాషులు నిర్వహించిన పలు వివాహాది శుభ కార్యక్రమాలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.అనంతరం వివాహ వేడుకలకు హాజరైన కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. తమ ఆహ్వానాన్ని స్వీకరించి వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఆయా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీకృష్ణ మందిరంలో ఎమ్మెల్యే అమిలినేని స్వంత నిధులతో ధ్వజస్థంభం, కళశ ప్రతిష్ఠాపన

**23 అడుగుల ధ్వజస్థంభం ఏర్పాటు.. ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే అమిలినేని**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 06 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో ధ్వజస్థంభం, గోపుర కళశం ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సోదరులు, భక్తులు కోరడంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తన స్వంత నిధులతో వాటిని ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, పెరవలి పార విశ్వనాథ్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడి ధ్వజస్థంభం పరిమాణం, కళశం రూపకల్పన తదితర అంశాలపై చర్చించారు. 23 అడుగుల ధ్వజస్థంభాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.మూడు రోజుల్లో ధ్వజస్థంభం కోసం అవసరమైన రాయిని ఆలయానికి తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ధ్వజస్థంభం ఏర్పాటు చేసే ప్రాంతంలో విద్యుత్ తీగలు అడ్డుగా లేకుండా చూడాలని, రాయిని కిందకు దించేందుకు అవసరమైన చోట ఇసుకను ఏర్పాటు చేయాలని సంబంధితులకు సూచించారు.ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అమిలినేని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పెరవలి పార విశ్వనాథ్, ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సోదరులు, భక్తులు పాల్గొన్నారు.



# విస్తృత నాకాబంది తనిఖీలు





- 14 బృందాలు 14 ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు....
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మందిపై కేసులు.....

**ధర్మవరం సెప్టెంబర్ 6 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ధర్మవరం పట్టణంలో పోలీసులు విస్తృత నాకాబంది తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల వరకు ప్రత్యేక నాకాబంది కార్యక్రమం కొనసాగింది. అడిషనల్ ఎస్పీ అంకిత సురాణ ఆధ్వర్యంలో డీఎస్పీ జగన్నాథ్ రాజుతో పాటు సీఐలు రెడ్డప్ప, జయనాయక్, ప్రభాకర్, మహమ్మద్ అలీ, సునీత, రామసుబ్బయ్య, 10 మంది ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ స్వయంగా పట్టణంలోని 14 ప్రాంతాల్లో 14 ప్రత్యేక బృందాలతో తనిఖీలను పర్యవేక్షించారు.

**ప్రధాన రహదారులు.. కూడళ్లలో తనిఖీలు....**

ప్రధాన రహదారులు, సరిహద్దు మార్గాలు, రద్దీ ప్రాంతాలు, ముఖ్య కూడళ్ల వద్ద నాకాబంది పాయింట్లు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన అనుమతి పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో 43 రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను సీజ్ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ఆపి వారి వివరాలను ఆరా తీశారు. రాత్రివేళల్లో అనవసరంగా సంచరించే వ్యక్తులు, అనుమానాస్పద వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా....**

నాకాబంది తనిఖీల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12 మందిపై కేసులు నమోదు చేశారు.

**నేరాల కట్టడే ప్రధాన లక్ష్యం....**

రాత్రివేళల్లో జరిగే నేరాలు, చోరీలు, అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా ఉంచడం, నేరాలను పూర్తిగా అణిచివేసే దిశగా చర్యలు చేపట్టడమే ఈ నాకాబంది ప్రధాన ఉద్దేశమని అడిషనల్ ఎస్పీ అంకిత సురాణ తెలిపారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాలోకి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని ఆమె తెలిపారు. అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలను ముందుగానే గుర్తించి నేరాలను అడ్డుకునేలా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ప్రజలు పోలీసులకు సహకరించాలి....**

ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అడిషనల్ ఎస్పీ తెలిపారు. రాత్రివేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.

**ఈ ప్రత్యేక నాకాబంది కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాణ, డీఎస్పీ జగన్నాథ్ రాజు, సీఐలు రెడ్డప్ప, జయనాయక్, ప్రభాకర్, మహమ్మద్ అలీ, సునీత, రామసుబ్బయ్య, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.**

# ఉద్యోగుల హక్కుల సాధనకు సహకరిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై సీఎం సానుకూల నిర్ణయాలు: ఏపీటీఎఫ్ 1938

**శెట్టూరు, సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్:**

**ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల అభీష్టం మేరకు పలు సానుకూల నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శెట్టూరు మండల ఏపీటీఎఫ్ 1938 నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.అక్టోబర్ నెల నుంచి రెండు విడతల కరువు భత్యాల చెల్లింపు, 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, ఉద్యోగుల వైద్య చికిత్సలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నెలనెలా చేపట్టడం, 2022 నాటి ఆర్థిక సెలవుల నగదీకరణను సంక్రాంతికి చెల్లించడం వంటి నిర్ణయాలు ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నాయకులు పేర్కొన్నారు.అదేవిధంగా పోలీసు సిబ్బందికి దసరా సందర్భంగా సరెండర్ సెలవుల నగదీకరణ, పెన్షనర్లకు క్వాంటం ఆఫ్ పెన్షన్ పెంపులో భాగంగా 70 ఏళ్ల వారికి 7 శాతం నుంచి 10 శాతానికి, 75 ఏళ్ల వారికి 12 శాతం నుంచి 15 శాతానికి పెంపు వంటి నిర్ణయాలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 3న జిల్లాస్థాయిలో సమావేశం నిర్వహించి, 5న రాష్ట్ర కమిటీ సమావేశం ప్రకటించిన వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాల ప్రతినిధులను చర్చలకు పిలవడం, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ ఇది ఉద్యోగుల అనుకూల ప్రభుత్వమని మరోసారి నిరూపించుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.**

**ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 2,650 మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయ దంపతులను స్వయంగా ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ఏపీటీఎఫ్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 గౌరవ అధ్యక్షులు బి. ఈరన్న, అధ్యక్షులు ముదిరాజు వన్నూరు స్వామి, ప్రధాన కార్యదర్శి మురళి, అసోసియేట్ అధ్యక్షులు సిద్ధ గంగప్ప, అసోసియేట్ కార్యదర్శి వన్నూరు స్వామి, సీనియర్ నాయకులు బొగ్గుల రామకృష్ణ, నాయకులు వీరభద్ర, నగేష్, విష్ణువర్ధన్, రామకృష్ణ, నాగసేన, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.**

# పుట్టపర్తిలో ఉచిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం

**- యువత, మహిళలకు నైపుణ్యమే భవిష్యత్తుకు పునాది: రత్నాకర్**



**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 6 , అనంత జనశక్తి న్యూస్:**

"ఒక నైపుణ్యం.. ఒక అవకాశం.. ఒక కొత్త జీవితం" అనే నినాదంతో పుట్టపర్తిలో ఉచిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ శ్రీకారం చుట్టారు. శ్రీ సత్యసాయి బాబా దివ్య ఆశీస్సులతో శ్రీ సత్యసాయి సేవా సంస్థల శ్రీ సత్య సాయి జిల్లా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు 38 రోజుల ఉచిత ట్యాలీ విత్ జీఎస్టీ శిక్షణను ఆదివారం మేడా గెస్ట్‌హౌస్‌లో ఆయన ప్రారంభించారు.ఈ శిక్షణకు అవసరమైన కంప్యూటర్లను సెంట్రల్ ట్రస్ట్ సమకూర్చగా, ఆర్థికంగా వెనుకబడిన 35 మంది మహిళలు శిక్షణ పొందనున్నారు. త్వరలో పుట్టపర్తిలో శాశ్వత నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రత్నాకర్ ప్రకటించారు. ఈ కేంద్రం స్థానిక యువత, మహిళలకు నిరంతర శిక్షణ, మార్గదర్శకత్వంతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలకు వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమన్నారు. ఒక నైపుణ్యం భవిష్యత్తుకు కొత్త మార్గాలను తెరుస్తుందని చెప్పారు. పిల్లలు, యువత కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి చూపినప్పుడు వారిని ప్రోత్సహించడం సమాజ బాధ్యత అన్నారు. ముఖ్యంగా మహిళలు, ఒంటరి తల్లులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం శిక్షణ మాత్రమే కాదని, జీవితాన్ని మార్చగల అవకాశమని, శిక్షణ అనంతరం ఇచ్చే ధ్రువపత్రం ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఉపయోగపడుతుందని తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మందికి శిక్షణ**

సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 20 వేల మంది యువతకు కంప్యూటర్, ట్యాలీ విత్ జీఎస్టీ, ఏసీ రిపేర్, జూట్ బ్యాగుల తయారీ, టైలరింగ్, బ్యూటీషియన్, బెడ్‌సైడ్ అసిస్టెంట్, సెల్‌ఫోన్ రిపేర్ తదితర కోర్సుల్లో శిక్షణ అందించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 23 చోట్ల శాశ్వత నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఆరు జిల్లాల్లో వైద్య రంగానికి సంబంధించిన నైపుణ్య కోర్సులు, ఆర్‌ఎస్‌ఈటీఐ సహకారంతో మరిన్ని కోర్సులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ సేవలకు సహకరిస్తున్న కెనరా బ్యాంక్, ఆర్‌ఎస్‌ఈటీఐలకు కృతజ్ఞతలు తెలిపారు.జాతీయ సేవా సమన్వయకర్త కోటేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యమే అవకాశాలకు వారధి అన్నారు. జాతీయ మహిళా సేవా సమన్వయకర్త డాక్టర్ శశిబాల మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించడం ద్వారా కుటుంబాలకు, సమాజానికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు. కెనరా బ్యాంక్ డైరెక్టర్ శాంతిప్రియ ట్యాలీ విత్ జీఎస్టీ ప్రాధాన్యతను వివరించారు.రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఇన్‌చార్జి నాగప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించగా, జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ మూర్తి స్వాగతం పలికారు. జిల్లా యువజన సమన్వయకర్త సురేష్ వందన సమర్పించారు. విశాఖ జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు కంటి వెలుగులే లక్ష్యం.



**- యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం.**

**ధర్మవరం సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్:**

పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా లక్ష్యము అని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వెంకట నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల) ఆవరణంలో ఉచిత ఐఓఎల్ కంటి వైద్య శిబిరమును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత కొన్ని సంవత్సరాలుగా ఈ కంటి వైద్య శిబిరమును, దాతల సహాయ సహకారములతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరమునకు 62 మంది కంటి రోగులు పాల్గొనగా, 32 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. నేటి ఈ శిబిరమునకు దాతలుగా కీర్తిశేషులు పిఆర్ సరోజమ్మ జ్ఞాపకార్థం భర్త పిన్ను రామకృష్ణ, హరిప్రసాద్ వారి కుటుంబ సభ్యులు పరిమళ, శైలజ వ్యవహరించడం పట్ల యువర్ ఫౌండేషన్ తరఫున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ కమిటీ తరఫున సన్మానించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరం యువర్స్ ఫౌండేషన్, జిల్లా అందత్వ నివారణ సంస్థ శ్రీ సత్య సాయి జిల్లా, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా యువర్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, దాత పిన్ను రామకృష్ణ మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ తరఫున వందలాదిమందికి వైద్య చికిత్సలను అందించి, కంటి చూపు కలిగించడం ఆనందించదగ్గ గర్వించదగ్గ విషయమని తెలిపారు. తదుపరి డాక్టర్ ప్రాంశు కటీపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను రోగులకు వివరించారు. శిబిరమునకు వచ్చిన వారందరికీ కూడా టిఫిన్, భోజనముతో పాటు ఉచిత రవాణా, ఉచిత ఆపరేషన్, ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు చైర్మన్ రాధాకృష్ణ, డాక్టర్ బి వి సుబ్బారావు, పోలా ప్రభాకర్, వైకె శ్రీనివాసులు, చాంద్ బాషా, మాజీ కౌన్సిలర్ కేతా లోకేష్ సత్రశాల మల్లికార్జున ,సికిందర్, గరే రమేష్ బాబు, కళ్యాణ్, శివారెడ్డి, కృష్ణమూర్తి, పాల్గొన్నారు

# మరణంలోనూ మానవత్వం రెండు కళ్ల దానం

**- విషాదం కుటుంబ సభ్యుల గొప్ప నిర్ణయం....**

**ధర్మవరం సెప్టెంబర్ 6 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పీటర్ అలియాస్ రమేష్ (36) సం, అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయితే ఈ విషాద సమయంలోనూ కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుతూ రమేష్ రెండు కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. రమేష్ ఇందిరమ్మ కాలనీలో షెలూన్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవారు. గత ఐదు నెలలుగా రెండు కిడ్నీలు విఫలమై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆయన ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందినట్లు తెలిపారు. రమేష్ మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అయినప్పటికీ ఆయన మరణానంతరం కూడా మరొకరికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు కళ్లదానానికి అంగీకరించారు. భార్య హేమలత, కుమార్తెలు షారోన్, సలోమి, కుమారుడు జస్వంత్ ముందుకు వచ్చి రమేష్ రెండు కళ్లను దానం చేసేందుకు నిర్ణయించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో కళ్లదానం ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో రమేష్ మరణానంతరం కూడా ఆయన కళ్ల ద్వారా మరో ఇద్దరికి చూపు లభించే అవకాశం ఏర్పడింది.

రమేష్ మృతితో ఇందిరమ్మ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. తీవ్ర దుఃఖంలోనూ కళ్లదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని స్థానికులు, బంధువులు అభినందించారు. కళ్లదానం ద్వారా రమేష్ మరణానంతరం కూడా మరొకరి జీవితాల్లో వెలుగులు నింపనున్నారని పలువురు పేర్కొన్నారు.



# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట.. పేద ముస్లింలకు న్యాయం టీడీపీతోనే సాధ్యం.. వక్ఫ్ బోర్డు చైర్మెన్ అబ్దుల్ అజీజ్**

**అనంతపురం సెప్టెంబర్ 06 అనంత జనశక్తి న్యూస్**




వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్ టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన అబ్దుల్ అజీజ్ కు టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మైనార్టీ సోదరులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, వక్ఫ్ ఆస్తుల నమోదు 68 వేల ఎకరాల నుంచి 82 వేల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. అనంతపురంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములకు నోటీసులు జారీ చేస్తున్నామని, వక్ఫ్ భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముస్లిం మైనార్టీలకు హజ్ యాత్రకు సహాయం అందిస్తున్నామని అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు ఏడాదికి రూ.40 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 17 నెలల బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించిందని తెలిపారు. పేద ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, మరింత మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దుల్హాన్ పథకాన్ని త్వరలో అమలు చేసేలా సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చిస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని అబ్దుల్ అజీజ్ అన్నారు.

నారా లోకేష్ దేశ, విదేశాల్లో పర్యటిస్తూ పరిశ్రమలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఏపీని ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో టీడీపీ మైనార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి మైనార్టీలు, టీడీపీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, టిడిపి నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పెనుకొండ అభివృద్ధే లక్ష్యం..



**- 23 వార్డుల్లో కూటమి విజయమే ధ్యేయం**

**పెనుకొండ సెప్టెంబర్ 06 అనంత జనశక్తి న్యూస్**

పెనుకొండ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి నాయకులు, అభ్యర్థులు ప్రజల ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా అనేక పనులు పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు.అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలంటే పట్టణంలోని 23 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని వారు కోరుతున్నారు. పట్టణానికి అవసరమైన మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించే పాలకవర్గం అవసరమని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వకుండా పెనుకొండ అభివృద్ధినే ప్రధాన అంశంగా ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. "పెనుకొండకు ఇంకా అభివృద్ధి అవసరం.. ఆ అభివృద్ధి కోసం కూటమికే మా మద్దతు" అనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని అన్నారు.గతంలో ఎన్నికైన వార్డు ప్రతినిధుల హయాంలో తమ వార్డుల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు పరిశీలించి, భవిష్యత్‌లో పట్టణ ప్రగతికి ఎవరు తోడ్పడతారో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కూటమి నాయకులు విజ్ఞప్తి చేశారు.పెనుకొండ ప్రగతి కోసం.. 23కి 23 వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# బలిజలకు రాజకీయంగా అన్యాయం

**- స్థానిక ఎన్నికల్లో 30% సీట్లు కేటాయించాలి.**

**- కాపునాడు జిల్లా అధ్యక్షుడు....**



**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 06 అనంత జన శక్తి న్యూస్.**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బలిజలకు 30 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని కాపునాడు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఇటికింటి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పుట్టపర్తిలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాయలసీమలో 52 అసెంబ్లీ, 8 ఎంపీ స్థానాలు ఉన్నప్పటికీ బలిజలకు కేవలం ఒక్క అసెంబ్లీ స్థానంతోనే సరిపెట్టారని, తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో బలిజలు కీలక పాత్ర పోషించినప్పటికీ తగిన గుర్తింపు లభించలేదన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలిజలకు కనీసం 30 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అలాగే విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అన్ని జిల్లాల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు.ప్రతి జిల్లాలో కాపు భవన్ నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని, గతంలో కాపు విదేశీ విద్యకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కాపు, బలిజ ఉపకులాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

# ఖైరేవు ఎల్లమ్మ ఆలయంలో 40 తులాల వెండి ఆభరణాల చోరీ

**- ఆలయాల్లో విలువైన ఆభరణాలను భద్రంగా ఉంచుకోవాలని పోలీసులు సూచన**

**శెట్టూరు, సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్:**



శెట్టూరు మండలం ఖైరేవు గ్రామంలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో సుమారు 40 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి వెండి ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై ఆలయ పూజారి ఈడిగ మరెక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు.

**ఆలయాల నిర్వాహకులకు పోలీసుల సూచన**

శెట్టూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆలయాల్లో ఉన్న విలువైన ఆభరణాలను అక్కడే ఉంచకుండా భద్రతా చర్యల్లో భాగంగా బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని శెట్టూరు ఎస్ఐ సూచించారు. ఆలయాల్లో విలువైన వస్తువుల భద్రత విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# అంగన్‌వాడీ లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి వాట్సాప్ నంబర్

**- పౌష్టికాహారం అందకపోతే 94417 82200కు ఫిర్యాదు చేయొచ్చు**

**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్:**




శ్రీ సత్యసాయి జిల్లాలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించాల్సిన పౌష్టికాహారం సక్రమంగా అందకపోతే ఫిర్యాదు చేసేందుకు ఐసీడీఎస్ వాట్సాప్ నియంత్రణ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ప్రమీల తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 94417 82200 నంబర్‌ను వాట్సాప్ నియంత్రణ నంబర్‌గా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందకపోతే ఈ నంబర్‌కు వాట్సాప్ ద్వారా మాత్రమే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.ఫిర్యాదు పంపే సమయంలో లబ్ధిదారు పేరు, మొబైల్ నంబర్, అంగన్‌వాడీ కేంద్రం నమోదు నంబర్, అంగన్‌వాడీ కేంద్రం పేరు, గ్రామం లేదా వార్డు, మండలం వివరాలను తప్పనిసరిగా పేర్కొనాలని సూచించారు. అవసరమైతే ఫిర్యాదుకు సంబంధించిన ఫొటోలు లేదా ఇతర ఆధారాలను కూడా జతచేయవచ్చన్నారు.ఈ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను మాత్రమే స్వీకరిస్తామని, ఫోన్ కాల్స్ స్వీకరించబడవని స్పష్టం చేశారు. అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

# డా. బాలగొండ వీరనారప్ప కి భాగవతరత్న పురస్కారం

**అనంతపురం సెప్టెంబర్ 06 అనంత జనశక్తి న్యూస్**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం లో ఆచార్య నీలకంఠాపురం సదాశివ రెడ్డిగారి పర్యవేక్షణ లో భాగవతం లోని మానవసంబంధాలు ప్రతిఫలనం అనే అంశం పైన పరిశోధన చేసిన బాలగొండ వీరనారప్ప కి భాగవత ప్రచార సమితి వారు భాగవతరత్న పురస్కారం ప్రధానం చేశారు. ఈయన ఇంతకుముందు భాగవతం లోని గజేంద్ర మోక్షం ప్రతీకాత్మకత అనే అంశం పైన ఎం. ఫిల్ చేశారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొన్నారు. ప్రస్తుతం పెనుకొండ ప్రభుత్వఉన్నత పాఠశాల లో తెలుగు ఉపాధ్యాయుడు గా పనిచేస్తున్నారు. ఈ పురస్కారం రావడంతో వీరనారప్పను పలువురు అభినందించారు.



# బోరంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. యువకుడు దుర్మరణం



**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 06 అనంత జనశక్తి న్యూస్**

కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంబదూరు మండలం వెంకటాంపల్లికి చెందిన హనుమంతరెడ్డి (30) మృతి చెందాడు. కళ్యాణదుర్గంలోని మహీంద్రా ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తున్న హనుమంతరెడ్డికి బోరంపల్లి గ్రామానికి చెందిన అంజినరెడ్డి కూతురుతో వివాహమైంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంలో వెళ్తున్న అనంతరెడ్డిని ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే



**యాడికి , సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్ :**

మండల పరిధిలోని చింతలాయపల్లి గ్రామానికి చెందిన పేరం రామిరెడ్డి (రామయ్య) ఆహ్వానం మేరకు కుమారుని వివాహానికి శ్రీ కోన రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి,యాడికి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి , నగరూరు బ్రహ్మానందరెడ్డి లు హాజరైనారు .నూతన వధూవరులను ఆశీర్వదించారు. యాడికి లోని కోట వీధికి చెందిన వెల్లబోయిన ఎరుకలప్ప కోడలి సీమంతం కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు .ఈ కార్యక్రమంలో చందన శివ ,చింతలాయ పల్లి రోసి రెడ్డి, పిన్నేపల్లి శేఖర్ రెడ్డి ,నారాయణరెడ్డి ,జూటూరు భాస్కర్ రెడ్డి ,కళ్ళమడి కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాత్మికతకు నిలయాలు ఆలయాలు:మంత్రి కందుల దుర్గేష్



**- సూర్యారావుపాలెంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి దుర్గేష్**

**నిడదవోలు సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

అధ్యాత్మికతకు నిలయాలు ఆలయాలు అని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామం నందు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ నిర్మాణం చేపట్టాలని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా అన్నారు.

# శ్రీ పల్లె కిషోర్ రెడ్డి జన్మదిన సందర్భంగా వీల్ చైర్ పంపిణీ.

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 06 అనంత జన శక్తి న్యూస్.**

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి పట్టణంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో ఖిద్మత్ఎఖల్క్.చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు షామీర్ ఆధ్వర్యంలో వీల్ చైర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షామీర్ మాట్లాడుతూ శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్, యువనాయకులు పల్లె కిషోర్‌రెడ్డికి జన్మదిన సందర్భంగా పుట్టపర్తి పట్టణంలో చిత్రావతి గుట్టపైన నివాసముంటున్న ఒక వ్యక్తి కి ఎడమ కాలు లేకపోవడంతో నడవడానికి ఇబ్బంది ఉందని మా దృష్టికి రావడంతో తక్షణమే స్పందించి వీల్ చైర్ అందించా మని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, శేషు, సాయి ప్రసాద్, కొరియర్ రమేష్ ,నారాయణస్వామి, సురేష్ ,జావిద్ తదితరులు పాల్గొన్నారు



# యాడికి పంచాయతీకి చెందిన రూ.51.41లక్షల రికవరీ ఊసే లేదాయే...





**- యాడికి పంచాయతీ లో జరిగిన అవినీతి ఎందుకు బయటపెట్టలేదు.....**
**- అవినీతి వెనుక ఎవరి హస్తం ఉంది.....?**
**- ఎవరెవరి అకౌంట్ లోకి నిధులు వెళ్లాయో......**
**- పేరుకు మాత్రమేనా తనిఖీ లు......?**
**- నిధులపై ఉన్నత అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారు......**
**- పన్నుల వసూలపై ఉన్న భాధ్యత రీకవరీలో లేదాయే.....**
**- ప్రజా ధనం మట్టిపాలేనా.......?**
**- ఇకనైనా అధికారులు మేలుకోవాలి......**

**యాడికి, సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్ :**

పేదవాడు కష్టపడి పని చేసిన సొమ్మును ఎవరైనా దొంగలించిన , లేక రూ.100 లను పోరపాటున పారేసుకోన్న అతనికి ఆకలి ,నిద్ర ఉండదు......, పేద వాడి భాధ ఎలా ఉంటుందో......ఆ పేద వాడికే తెలుసు......, పేదవాడి భాదను ఎవరు పట్టించు కోరు.....,అలాగే ధనవంతులు ఇంట్లో దొంగతనం జరిగితే ఆర్భాటం చేస్తారు......., వెంటనే రికవరీ చేస్తారు.....అదే విధంగా ప్రభుత్వం కార్యాలయంలో అవినీతి జరిగితే పేరుకు మాత్రమే విచారణలు జరిపినారని, రెండు సంవత్సరాలు గడిచినా అవినీతి ని బయటపెట్టలేదు అనడానికి నిదర్శనం యాడికి పంచాయతీ లో జరిగిన అవినీతి అని ప్రజలు తెలిపారు.యాడికి పంచాయతీ కి ఆర్థిక సంఘం ద్వారా, పన్నుల ద్వారా, ఇతర వాటి ద్వారా వచ్చిన ఆదాయంలో ఏకంగా రూ.51.41లక్షల నిధులకు అవినీతి జరిగితే..... రెండు సంవత్సరాలు గడిచినా రికవరీ విషయంలో నిధులు ఊసే లేదాయే...... అని ప్రజలు చర్చించుకోంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అంటేనే అంత చులకనా....... అని, ఉన్నత అధికారులు తూతుమంత్రంగా విచారణ జరిపినారా .....,?,రూ.51.41 లక్షల రికవరీ ఏమాయే..... అని , యాడికి పంచాయతీ లో జరిగిన అవినీతి ఎందుకు బయటపెట్టలేదు.....అని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో జరిగిన అవినీతి వెనుక ఎవరి హస్తం ఉందని.....? ,ఎవరెవరి అకౌంట్ లోకి నిధులు వెళ్లాయో అని, వివరాలను అరా తీయడం లో అధికారులు ఎందుకు ఇంత ఆలస్యం చేస్తున్నారని,అవినీతిమయమైన సోమ్ము పై ఉన్నత అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రజలు చర్చించుకోంటున్నారు. క్రమం తప్పకుండా పంచాయతీ సిబ్బంది ఇంటి పన్ను, కొళాయి పన్నులను ప్రజల నుండి వసూలు ఎలా చేస్తున్నారో........, అవినీతి పరుల నుండి ఉన్నత అధికారులు రికవరీ సోమ్మును ఎందుకు వసూలు చేయలేకపోతున్నారని, వసూలపై ఉన్న భాధ్యత రీకవరీలో ఎందుకు లేదు అని,ప్రజా ధనం మట్టిపాలేనా......అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే ఆర్థిక సంఘం నిధులను ఏ ఏ పనులకు వినియోగించాలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు జారీ చేశాయని తెలిపారు. సాధారణంగా పంచాయతీ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి సరఫరా , పైప్‌లైన్లు, నీటి ట్యాంకులు, చిన్న మరమ్మతుల కు , పారిశుద్ధ్యం ,డ్రైనేజీ, కాలువల శుభ్రపరిచే పనులకు, చెత్త నిర్వహణకు, వీధి దీపాల ఏర్పాటుకు , మరమ్మతులకు,నిర్వహణకు,గ్రామంలోని మౌలిక సదుపాయాలకు,స్థానిక మార్గాలకు, చిన్న రహదారులకు ,కాలువ మరమ్మతులు (అనుమతించబడిన మేరకు)కు, పారిశుద్ధ్య సౌకర్యాలకు, ప్రజా మరుగుదొడ్లు కు, పర్యావరణ పరిరక్షణ - నీటి సంరక్షణ కు, మొక్కలు పచ్చదనం వంటి పనులకు , నిబంధనల మేరకు పంచాయతీ ఆస్తుల నిర్వహణకు ఉపయోగించవచ్చు అని ప్రభుత్వాలు తెలుపుతున్నాయని తెలిపారు. యాడికి పంచాయతీ ఉత్తమ స్వచ్ఛ భారత్ కింద అవార్డు వచ్చిందని,పాలనలో మాత్రం స్వచ్ఛత లేదని,ఎక్కడపడితే అక్కడ చెత్త ఉందని, కాలనీలో కాలువ పై స్లోప్ ధ్వంసం అయ్యిందని పలుమార్లు అధికారులకు , నాయకులకు విన్నవించిన పెడ చెవిన పెట్టారని తెలిపారు.మరి కొన్ని కాలనీ లో కాలువలు లేక రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోందని, కొన్ని కాలనీలలో రహదారులు లేక అవస్థలు పడుతున్నారని, ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ లో ఉన్న మౌళిక సదుపాయాల అభివృద్ధి కి ఉపయోగించకుండా పక్కదారి పట్టించడంతో అభివృద్ధి శూన్యం అయ్యిందని పలువురు తెలిపారు. రూ.51.41 లక్షల తో యాడికి పంచాయతీ ని అభివృద్ధి చేయవచ్చు అని, ఇకనైనా ఉన్నత అధికారులు మేలుకోని అవినీమయమైన సోమ్మును వసూలు చేసి, యాడికి పంచాయతీ అభివృద్ధి కి సహాకరించాలని ప్రజలు కోరారు.





# మంత్రి సత్యకుమార్ రెండు రోజుల పర్యటన



**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్ :**

మెగా జాబ్‌మేళా, యోగా సెంటర్ ప్రారంభం ఓబీసీ సమావేశంలో పాల్గొననున్న మంత్రి.....

ధర్మవరం నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, సత్యకుమార్ యాదవ్ రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.

8న మెగా జాబ్‌మేళా.....

సెప్టెంబర్ 8న ఉదయం 10 గంటలకు ధర్మవరం పట్టణంలోని సీఎన్‌బీ కళ్యాణ మండపంలో సంస్కృతి సేవా సమితి సహకారంతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారు. మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ఏపీ ప్రభుత్వ గౌరవ సలహాదారు జి. సతీష్‌రెడ్డితో కలిసి కార్యక్రమానికి హాజరవుతారు. ధర్మవరం, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**9న యోగా సెంటర్ ప్రారంభం....**

సెప్టెంబర్ 9న ఉదయం 9 గంటలకు కళాజ్యోతి సర్కిల్ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌పై ఏర్పాటు చేసిన నూతన యోగా సెంటర్‌ను మంత్రి ప్రారంభించనున్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాధాన్యతను చాటిచెప్పే ఉద్దేశంతో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరు....**

అదే రోజు ఉదయం 10 గంటలకు ధర్మవరం రూరల్ మండలం గొట్లూరు గ్రామంలో జరిగే ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారు. ఓబీసీ వర్గాల సంక్షేమం, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలతో పాటు పార్టీ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

**- వైసీపీ అనుబంధ విభాగాలన్నీ బలోపతమవ్వాలి**
**- వైఎస్ఆర్‌సీపీ యుజవన విభాగం చురుగ్గా పని చేయాలి**
**- హామీల అమలులో సీఎం చంద్రబాబు విఫలం**
**- నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధికి మంగళం**
**- మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ**
**- రాష్ట్ర వ్యాప్తంగా వెలుగులోకొస్తున్న డీఎస్సీ అక్రమాలు**
**- కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**
**- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు**



**అనంతపురం, సెప్టెంబర్ 6 : అనంత జనశక్తి న్యూస్**

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో చూపుదామని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నామని, యువజన విభాగం కీలక పాత్ర వహించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం వైసీపీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరంలోని 1, 2, 19, 23, 24, 25, 27, 28, 29, 43, 44, 45, 46, 47, 48 డివిజన్లకు చెందిన యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, వైసీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంత వెంకటరామిరెడ్డి హాజరై దిశానిర్దేశం చేశారు. ఈరోజు జెన్‌జీ జమానా నడుస్తోందని, యువత అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. నీట్ పేపర్ లీకేజీపై యువత ఉద్యమిస్తే కేంద్ర మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటిగా డీఎస్సీ స్పోర్ట్ కోటా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో సీఎం చంద్రబాబు విఫలం చెందారని తెలిపారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమ గురించే ఆలోచిస్తుందని స్పష్టం చేశారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టులు చేస్తోందని, వీటికి ఎవరూ భయపడొద్దన్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు మధ్య తేడాను ప్రజలకు వాస్తవాలతో వివరించాలని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఒకే నోటిఫికేషన్‌తో 1.35 లక్షల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి అక్రమాలకు పాల్పడిందని, పైగా ప్రచార ఆర్భాటం చేస్తోందని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో సంక్షేమ పథకాలను అందిస్తే అంతకంటే ఎక్కువగా ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు చంద్రమోహన్‌రెడ్డి, ఇసాక్, సంపంగి రామాంజినేయులు, శ్రీనివాసులు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, వైసీపీ నేతలు హనుమంతు, రామచంద్ర, రాజు, నిమ్మల నాగరాజు, నారాయణరెడ్డి, అరవింద్, ప్రసన్న లక్ష్మి, అబ్బాస్, మనోజ్, కుమార్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లోకనాథ్‌రెడ్డి, మణిరాయల్, జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, నగర అధ్యక్షుడు దత్త, ఉపాధ్యక్షుడు వినీత్, ఉదయ్, నగర ప్రధాన కార్యదర్శి మసూద్, మైను, నగర కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి, బబ్లూ పాల్గొన్నారు.

# ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ డిజైన్, డీపీఆర్ పనులు ప్రారంభం

- ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రత్యేక పర్యవేక్షణలో సర్వే ప్రారంభించిన ఐఐటీ మద్రాస్
- తీర ప్రాంతం వెంబడి ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం డ్రోన్ సర్వే
- అత్యాధునిక సాంకేతికతతో బీచ్ ప్రొఫైల్, తీరాల మ్యాపింగ్ చేస్తున్న బృందం
- తీరం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాల సేకరణ, పరీక్షలు
- అధ్యయనం పూర్తయిన అనంతరం రక్షణ గోడ అలైన్‌మెంట్‌పై కసరత్తులు
- డిజైన్, డీపీఆర్ తో పాటు సమాంతరంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశం





**పిఠాపురం సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

పిఠాపురం నియోజక వర్గంలోని ఉప్పాడ తీర ప్రాంతవాసుల దశాబ్దాల కల సాకారం దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం దిశగా కీలక అడుగులు ప్రారంభమయ్యాయి. రక్షణ గోడ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్న ఐఐటీ మద్రాస్ పనిని ప్రారంభించింది. రూ. 323 కోట్లనేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌తో నిర్మితమవుతున్న ఈ రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఐఐటీ మద్రాస్ ప్రతినిధి బృందం అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సముద్ర గర్భంలోనూ, తీర ప్రాంతం వెంబడి సర్వే చేపట్టింది.

తీర ప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో విశేష అనుభవం కలిగిన ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం గత వారం రోజులుగా ఉప్పాడ తీర ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టింది. అధునాతన డ్రోన్లతోపాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంతాల మ్యాపింగ్ కోసం ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే సాంకేతికతను వినియోగిస్తున్నారు. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్ర అలల ప్రభావం, తీర కోత తీవ్రత, భూభాగ మార్పులు, సముద్ర ప్రవాహాల దిశలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నీటి అడుగు భాగం నుంచి బీచ్ వరకు ఇసుక కణాల సేకరణ, సమగ్ర అధ్యయనం సాగుతోంది. వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంతం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాలు సేకరించి, శాస్త్రీయ అధ్యయన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, వాటి మార్పులను గుర్తిస్తున్నారు. బీచ్ ఆకృతి, వాలు, ఎత్తుపై అధ్యయనం కొనసాగుతోంది. షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. తీర ప్రాంత కోతను అంచనా వేయడంలో ఈ అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుంది.ఉప్పాడ సముద్ర తీరం వెంబడి ప్రతిపాదిత రక్షణ గోడ నిర్మాణానికి అనువైన అలైన్‌మెంట్‌ను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. భవిష్యత్తులో సముద్ర కోత ప్రభావాన్ని సమర్థవంతంగా, సుదీర్ఘకాలం ఎదుర్కొనే విధంగా డిజైన్ రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఈ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఐటీ మద్రాస్ ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ తదితర సాంకేతిక అంశాలపై దృష్టి సారించనుంది.

గత నాలుగు దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఎంతో మంది నిర్వాసితులు కాగా, రైతులు వందల ఎకరాల పంట భూములను సైతం కోల్పోయారు. ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపట్టారు.జాతీయ విపత్తు నిర్వ హ ణ సంస్థ (NDMA) ప్రతిపాదన మేరకు సీ ప్రొటెక్షన్ వాల్ , గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయి. పవన్ కళ్యాణ్ ఈ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిఠాపురం పర్యటన సందర్భంగా డిజైన్, డీపీఆర్ పై ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందంతో చర్చించనున్నారు. నిర్దిష్ట గడువు లోపు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా డిజైన్, డీపీఆర్ రూపకల్పన సమాంతరంగా పర్యావరణ, తదితర అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ఆదేశించారు.





## జిల్లా వ్యాప్తంగా డ్రోన్లతో పోలీసుల నిఘా

**- అసాంఘిక కార్యకలాపాల అణచివేతే లక్ష్యం: ఎస్పీ పి. జగదీష్**

**అనంతపురం, సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**



శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల అణచివేతే లక్ష్యంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆదివారం అనంతపురం జిల్లా వ్యాప్తంగా పోలీసులు డ్రోన్లతో గస్తీ ముమ్మరం చేశారు.సమస్యాత్మక ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, రక్షిత మండలాలు, అనుమానాస్పద స్థావరాలపై ఆధునిక డ్రోన్ కెమెరాల ద్వారా పోలీసులు నిశిత నిఘా ఏర్పాటు చేశారు. భౌగోళికంగా చేరుకోవడానికి కష్టతరమైన ప్రాంతాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి ప్రత్యక్ష చిత్రాల ద్వారా అనుమానాస్పద కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నారు. జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ ప్రత్యేక నిఘా చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రజల భద్రతకు పోలీసు యంత్రాంగం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.చట్టాన్ని ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, అనుమానాస్పద కదలికలు గుర్తించినా వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రకృతి ఒడిలో పవిత్రమైన ఋషికేష్:

**- రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు.**

**ఋషికేష్ సెప్టెంబర్ 06 అనంత జనశక్తి న్యూస్**



హిమాలయాల ఒడిలో, పవిత్ర గంగా నదీ తీరాన వెలసిన ఋషికేష్ ఎంతో పవిత్రమైన, ఆధ్యాత్మిక శోభతో విలసిల్లే అద్భుత క్షేత్రమని ప్రముఖ పర్యావరణవేత్త, రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు కొనియాడారు. ఇటీవల ఈ పవిత్ర ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, ఇక్కడి ప్రకృతి విశిష్టతను మరియు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రశంసిస్తూ మాట్లాడారు. ఋషికేష్ ప్రకృతి సౌందర్యాన్ని ఉద్దేశించి ఆయన ప్రధానంగా పేర్కొన్న ముఖ్యాంశాలు:స్వచ్ఛమైన వాతావరణం: పచ్చని హిమాలయ పర్వత శ్రేణులు, గలగల పారే పవిత్ర గంగా నది ఇక్కడి గాలిలో ఒక రకమైన దైవిక ప్రశాంతతను, స్వచ్ఛతను నింపుతాయి.ఆధ్యాత్మిక వృక్ష సంపద: ఇక్కడ విస్తరించి ఉన్న వృక్షాలు, మూలికలు వాతావరణాన్ని పరిశుద్ధం చేయడమే కాకుండా, మానసిక ఒత్తిడిని తొలగించి అంతర్ముఖ ధ్యానానికి అనుకూలమైన శక్తిని అందిస్తాయి.

జల సమృద్ధి జైవిక వైవిధ్యం: సదా నిర్మలంగా ప్రవహించే గంగా నది జీవవైవిధ్యానికి నిలయంగా నిలుస్తూ, ప్రకృతి ప్రేమికులకు మరియు యోగాభ్యాసకులకు ఎనలేని సంతోషాన్ని కలిగిస్తుంది.

ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ నాయుడు మాట్లాడుతూ — "ఋషికేష్ కేవలం ఒక పర్యాటక ప్రాంతం మాత్రమే కాదు; మనస్సును, శరీరాన్ని పునరుజ్జీవింపజేసే ప్రకృతి ప్రసాదించిన పరమ పవిత్రమైన చికిత్సాలయం. ఇటువంటి పవిత్ర పర్యావరణాన్ని, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని రాజయోగి భాస్కర్ నాయుడు పిలుపునిచ్చారు.

# గుండెపోటుతో జార్ఖండ్ మంత్రి కన్నుమూత

- జేఎమ్ఎమ్ సీనియర్ నేత సుదివ్య కుమార్ సోను
- ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస

**రాంచీ, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

జార్ఖండ్ ఉన్నత, సాంకేతిక విద్య, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి సుదివ్య కుమార్ సోను(56) గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. శనివారం రాత్రి అస్వస్థతకు గురైన జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎమ్ఎమ్) సీనియర్ నేతను రాంచీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల సమయంలో ఆయన కన్నుమూశారు.

1970 జులై 26న జన్మించిన సోనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. సోను 2019లో గిరిడీహ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఉన్నత విద్య, పట్టణాభివృద్ధితో పాటు పర్యాటకం, కళలు, సాంస్కృతికం, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సోను మృతిపై సీఎం హేమంత్ సోరెన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను విశ్వసనీయ సహచరుడు, మార్గదర్శి, జార్ఖండ్ ఉద్యమానికి అంకితమైన నేతగా స్మరించుకున్నారు సోరెన్. మరోవైపు.. మంత్రి మృతిపై జేఎమ్ఎమ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. జేఎమ్ఎమ్ పార్టీ సహా ప్రభుత్వానికి, జార్ఖండ్‌కు ఇది తీరని లోటు అని పేర్కొంది.

కాగా.. ఇటీవలే జార్ఖండ్ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తూ కర్ణాటకలో పర్యటించారు సోను. అక్కడ పర్యాటక మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేసి, కర్ణాటక పర్యాటక శాఖ మంత్రితో చర్చలు జరిపారు.



## స్థానిక ఎన్నికల సమన్వయ బాధ్యతలు చిలకంకు

**-హిందూపురం, కర్నూలు పార్లమెంట్**

**-నియోజకవర్గాలకు జనసేన సమన్వయకర్తగా చిలకం మధుసూదన్‌రెడ్డి....**

**ధర్మవరం సెప్టెంబర్ 6, అనంత జనశక్తి న్యూస్:**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిని హిందూపురం, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గాల స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా నియమించింది. ఎన్నికల నిర్వహణ, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం కోసం మరో 20 మందితో ప్రత్యేక కోఆర్డినేషన్ టీమ్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ బృందం పార్లమెంట్ పరిధిలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లనుంది.

అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమాచార సేకరణ, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాల పై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి బలమైన ప్రాతినిధ్యం సాధించే దిశగా చిలకం మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలోని బృందం పనిచేయనుంది.

# పొగాకు రైతులకు గుడ్ న్యూస్

- గిట్టుబాటు ధరల కోసం ప్రభుత్వం చర్యలు
- ప్రస్తుతం సగటు ధర కిలోకు రూ. 209.83
- ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో కిలోకు గరిష్ఠంగా రూ. 329
- ఎస్ఎల్ఎస్‌లో రూ. 255, ఎస్‌బీఎస్‌లో రూ. 252 గరిష్ట బిడ్

**అమరావతి, సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో పొగాకు రైతులు పడుతున్న అవస్థలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆకు మంచి రంగు వచ్చినప్పటికీ దానికి తగ్గ ధర లభించడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు రైతుకు సరైన మద్దతు ధర లభించడం లేదంటూ వేలం కేంద్రాల్లో నిరసనలు కూడా చేపట్టారు. అయితే, ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని.. పొగాకు రైతులకు గిట్టుబాటు ధరల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఎఫ్‌సీవీ పొగాకు మార్కెట్‌లో పరిస్థితులు మెరగవుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పొగాకు వేలం కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 86.59 మిలియన్ కిలోల పొగాకు విక్రయం జరిగిందని, ప్రస్తుతం సగటు ధర కిలోకు రూ. 209.83 పలుకుతోందని వెల్లడించారు. అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్‌పై ఒత్తిడి పడిందని.. ఆ కారణంతోనే రైతులకు కొంత ఇబ్బందని ఆయన చెప్పారు.

**"నో బిడ్ బేల్స్ 11-12 శాతానికి తగ్గినట్లు వెల్లడవుతోంది. కొన్ని వేలం కేంద్రాల్లో నో బిడ్‌లు 1-2 శాతం మాత్రమే ఉన్నాయి. కొనుగోలుదారుల పోటీ పెరగడంతో ధరలు మెరుగుపడుతున్నాయి. వారానికి పది మిలియన్ కిలోల పొగాకు విక్రయం జరుగుతోంది. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో కిలోకు గరిష్ఠంగా రూ. 329 ధర పలుకుతోంది. ఎస్ఎల్ఎస్‌లో రూ. 255, ఎస్‌బీఎస్‌లో రూ. 252 గరిష్ట బిడ్ ఉంటోంది" అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.**

**పరిష్కారానికి అధికారులు పర్యటిస్తున్నారని.. 2026- 27లో ఎఫ్‌సీవీ పంట పరిమాణం 142 నుంచి 81 మిలియన్ కిలోలకు తగ్గించామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి నియంత్రణే తమ లక్ష్యమని, రైతులు అనుమతించిన మేరకే సాగు చేయాలని టొబాకో బోర్డుతో అవగాహన కుదిరిందని, వేలం పూర్తయ్యే వరకూ రైతులకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.**

# వైఎస్ షర్మిల కుమార్తె అంజలి రెడ్డి వివాహం

**అమరావతి, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట త్వరలోనే పెళ్లి బాజా మోగనుంది. వైఎస్ షర్మిల, అనిల్ కుమార్ దంపతుల కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం నిశ్చయమైంది. ఈ వార్తను వైఎస్ షర్మిల స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా అధికారికంగా వెల్లడించారు. సోమల సుబ్బా రెడ్డి కుమారుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సోమల రఘురామ్ రెడ్డితో అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు ఆమె తెలిపారు.

'నా భర్త అనిల్ కుమార్, నేను దేవునికి ఎంతో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. మా కుమార్తె వివాహానికి సంబంధించిన ఈ శుభవార్తను మీ అందరితో పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. మా కుమార్తె అంజలి రెడ్డి, డాక్టర్ సోమల రఘురామ్ రెడ్డిల వివాహబంధానికి మీ అందరి ఆశీస్సులు, ప్రార్థనలు, శుభాకాంక్షలు కావాలని కోరుకుంటున్నాం.' అని వైఎస్ షర్మిల రాసుకొచ్చారు.

వరుడు రఘురామ్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన వివరాలను కూడా షర్మిల పంచుకున్నారు. వీరి కుటుంబం మూలాలు ఉమ్మడి కర్నూలు జిల్లాకు



చెందినవి కాగా, ప్రస్తుతం కుటుంబ సభ్యులందరూ అమెరికా పౌరులుగా అక్కడే స్థిరపడ్డారు. వృత్తిరీత్యా డాక్టర్ రఘురామ్ రెడ్డి అమెరికాలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబం వైఎస్సార్ కడప జిల్లాకు చెందింది కాగా, వరుడి కుటుంబం రాయలసీమకే చెందిన కర్నూలు జిల్లాకు సంబంధించింది కావడం విశేషం.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మనవరాలు, షర్మిల కుమార్తె అయిన అంజలి రెడ్డి విద్యాభ్యాసం విదేశాల్లోనే సాగింది. వైఎస్ షర్మిల కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహం అట్లూరి ప్రియతో ఇటీవల వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ఆ వేడుక ముగిసిన కొద్ది నెలల్లోనే ఇప్పుడు కుమార్తె అంజలి రెడ్డి వివాహం జరగనుంది.

ఈ జంట నిశ్చితార్థం, వివాహ వేడుకలకు సంబంధించిన తేదీలను, వేదిక వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. రాజారెడ్డి పెళ్లికి కుటుంబ సభ్యులతో పాటు ఇరు రాష్ట్రాల రాజకీయ, సినీ ప్రముఖులు హాజరైనట్లే, అంజలి రెడ్డి వివాహ వేడుకను కూడా కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వైఎస్సార్ అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# సీఎంతో జరిగిన చర్చల్లో హామీలు లభించాయి

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ ఉద్యోగులకూ సెప్టెంబర్ నుంచి అదనంగా మరో సరెండర్ లీవ్ ప్రకటించినట్లు వివరించారు.

అంతేకాకుండా.. ఉద్యోగుల ఆరోగ్య కార్డుల సమస్యను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు విద్యాసాగర్ తెలిపారు. అయితే.. ప్రభుత్వం నుంచి హెల్త్ ట్రస్టుకు నెలకు రూ.36 కోట్ల మేర నిధులు జమకాకపోవడంతో ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోందని, నగదు రహిత వైద్య సేవలకు ఆస్పత్రులు ముందుకు రావడంలేదని వివరించారు. వచ్చే నెల నుంచి ట్రస్టుకు నిధులు విడుదల చేస్తే మరో 3 నెలల్లో సమస్యను పరిష్కరించవచ్చని తాను చెప్పగా.. నిధులు బదిలీ చేసేందుకు అధికారులకు సీఎం ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 4 లక్షల మంది పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10 శాతానికి పెంచాలని కోరగా.. జనవరి 1 నుంచి అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఇంటీరియమ్ రిలీఫ్‌పై కూడా ఆయన సానుకూలంగా స్పందించి, షెడ్యూల్ రూపొందించి అమలు చేస్తామని హామీ ఇచ్చారని విద్యాసాగర్ పేర్కొన్నారు.

ఇక.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై కూడా చర్చలు జరిగాయని ఏపీ జేఏసీ ఛైర్మన్ చెప్పారు.




'ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించాం. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమస్యలపై కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లాం. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ ఎప్పుడూ చర్చల మార్గాన్నే అనుసరిస్తుంది. కానీ ప్రభుత్వం స్పందించని స్థితుల్లో ఉద్యమానికి ఏ మాత్రం వెనుకాడబోం' అని హెచ్చరించారు. సెప్టెంబర్ 5న ఉద్యమ శంఖారావానికి సిద్ధమైన సమయంలో సీఎంతో చర్చలు జరగడం, అవి సఫలం కావడం శుభపరిణామమని విద్యాసాగర్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు మనోహర్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, సాయి ప్రసాద్‌లకు ఏపీ జేఏసీ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల మూడో వారంలో రాష్ట్ర సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వెల్లడించారు.

**సీఎం స్పందన హర్షణీయం: ఏపీ జేఏసీ సెక్రటరీ కేఎస్ఎస్ ప్రసాద్**

ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించడం హర్షణీయమని ఏపీ జేఏసీ సెక్రటరీ కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. సీఎంతో నిన్న జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని, తమ సమస్యలను ఓపిగ్గా విని పరిష్కారానికి భరోసా ఇచ్చినందుకు సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు సహా గురుకులాలు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు అంశంపై చర్చలు జరిపినట్టు తెలిపారు ప్రసాద్. టెట్ పరీక్షలకు సంబంధించిన సమస్యలనూ సీఎం దృష్టికి తీసుకెళ్లామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ఆయన భరోసా ఇచ్చారని చెప్పారు.

# ప్రతిపక్ష నేత హోదాకు కేసీఆర్ న్యాయం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంటే.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దని.. అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి అప్పగించాలని హితవు పలికారు. ''నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ప్రజలు పోరాడి స్వరాష్ట్రం సాధించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అవి కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయి. ఉన్నత చదువులు చదివితే సరిపోదు.. సంస్కారం కూడా ఉండాలని కేటీఆర్ గ్రహించాలి. ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి కృషితో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. నగరానికి అనుబంధంగా ఫ్యూచర్‌సిటీ మరో గొప్ప నగరంగా ఎదుగుతోంది. సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల.. పదేళ్లపాటు నెరవేరలేదు. ప్రతి నియోజకవర్గానికీ 2,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాం''అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.



# స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలు మోహరించాలి

**అమరావతి, సెప్టెంబర్ 06, అనంత జనశక్తి న్యూస్**

స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లేఖ రాసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భద్రత కోసం కేంద్ర బలగాలను మోహరించాలని వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి ఎస్ఈసీకి లేఖ రాశారు. స్థానిక ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, బెదిరింపులు వంటివి లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షిపాతంగా ఎన్నికలు జరిపేందుకు కేంద్ర బలగాలను మోహరించాల్సిన అవసరం ఉందని కోరారు. వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ వ్యక్తులు పోలింగ్ ప్రక్రియలో జోక్యం చేసుకున్నారని వైసీపీ



ఆరోపించింది. అనుమతి లేకుండానే పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించారని.. పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు, ఓటర్లను బెదిరించారని వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి లేఖలో ప్రస్తావించారు.

అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం సహా పోలింగ్ ప్రక్రియకు ఇబ్బందులు కలిగించారని లేఖలో పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇలాంటి దారుణాలకు పాల్పడ్డారన్న లేళ్ల అప్పిరెడ్డి.. పిడుగురాళ్ల, పాలకొండ, తుని మున్సిపాలిటీలలో ఇలాంటి అరాచకాలే పాల్పడ్డారని అప్పిరెడ్డి లేఖలో ఆరోపించారు. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పోటీ తీవ్రంగా ఉంటుందని.. ఈ నేపథ్యంలో బెదిరింపులు, నామినేషన్ల దాఖలు సమయంలో అడ్డంకులు సృష్టించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ లేఖలో పేర్కొంది.

దగ్గర నుంచి ఎన్నికల సామాగ్రి రవాణా, పోలింగ్, స్ట్రాంగ్ రూముల భద్రత వరకూ ఇలా అన్ని దశలలోనూ కేంద్ర బలగాలను మోహరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను లేఖలో కోరారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని.. కేంద్ర బలగాల సాయంతో భద్రతా చర్యలు చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. మరోవైపు త్వరలోనే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయి. బీసీ రిజర్వేషన్ల ఖరారుతో పాటుగా మున్సిపల్ ఎన్నికల నిబంధనలు కూడా వెల్లడించారు.

# జేఎన్ యూ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

**- 10 మంది విద్యార్థినుల ఫిర్యాదులు**
**- ప్రొఫెసర్‌పై వరుస ఫిర్యాదులు**

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్‌పై తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. కనీసం 10 మంది విద్యార్థినులు సదరు ప్రొఫెసర్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న యూనివర్సిటీ అధికారులు కేసును ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కి అప్పగించినట్లు సమాచారం. ఈ ఫిర్యాదులు సుమారు నెల రోజుల క్రితమే నమోదైనట్లు తెలుస్తోంది. తొలుత ఓ విద్యార్థిని ఫిర్యాదు చేయగా, విషయం ఇతర విద్యార్థులకు తెలియడంతో కొంతమంది సీనియర్ విద్యార్థులు కూడా ముందుకు వచ్చి అదే ప్రొఫెసర్‌పై ఇలాంటి ఆరోపణలు చేసినట్లు సమాచారం.

**ప్రొఫెసర్‌పై అనుచిత ప్రవర్తన ఆరోపణలు**

ఫిర్యాదుల్లో ప్రొఫెసర్ విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించినట్లు తెలుస్తోంది. కొంతమంది విద్యార్థులను క్యాంపస్‌లోని తన నివాసంలో జరిగే సమావేశాలకు పిలిచేవారని, అక్కడ వారితో అనుచిత లైంగిక ప్రవర్తనకు ప్రయత్నించారని కొందరు ఫిర్యాదుదారులు ఆరోపించినట్లు సమాచారం. అంతేకాకుండా, తరగతి గదిలో కూడా ప్రొఫెసర్ అభ్యంతరకరమైన, అసభ్యకర వ్యాఖ్యలు చేసేవారని కొందరు విద్యార్థులు ఆరోపించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలను స్వతంత్రంగా నిర్ధారించలేదు. ప్రస్తుతం కేసు ICC దర్యాప్తు పరిధిలో ఉంది. కాబట్టి విచారణ పూర్తయ్యే వరకు ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుంది.

**మరికొందరు విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి**

తొలుత ఓ విద్యార్థిని ఫిర్యాదు చేసిన తర్వాత ఈ విషయం ఇతర విద్యార్థులకు తెలిసినట్లు సమాచారం. దీంతో కొంతమంది సీనియర్ విద్యార్థులు కూడా తమకు ఎదురైనట్లు చెబుతున్న అనుభవాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఫిర్యాదుల సంఖ్య పెరిగి, కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. యూనివర్సిటీలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, నిర్ణీత విధానాల ప్రకారం చర్యలు తీసుకోవడానికి ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ పనిచేస్తుంది.

**ICC దర్యాప్తు కొనసాగింపు**

ప్రస్తుతం ఈ ఫిర్యాదులపై ICC విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు, ఆరోపణలకు సంబంధించిన ఇతర అంశాలను కమిటీ పరిశీలించే అవకాశం ఉంది. విచారణ పూర్తయ్యే వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని దోషిగా పేర్కొనడం సరికాదు. ICC దర్యాప్తు, దాని తుది నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.



**JNU అధికారిక స్పందన కోసం ఎదురుచూపులు**

ఈ వ్యవహారంపై ప్రస్తుతం JNU పరిపాలన లేదా వైస్ ఛాన్సలర్ కార్యాలయం నుంచి అధికారిక స్పందన వెలువడలేదని సమాచారం. ICC దర్యాప్తు ఏ దశలో ఉందో, ఇప్పటివరకు కమిటీ ఎలాంటి చర్యలు తీసుకుందో కూడా అధికారికంగా వెల్లడించలేదు. JNU యాజమాన్యం నుంచి అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.



# రేవంత్ ప్రభుత్వం భయపడుతుంది

(మొదటి పేజీ తరువాయి)

రేపటి నుంచి జరగనున్న సమావేశాల్లో మాట్లాడే అంశాలపై చర్చించామని మహేశ్వర్ రెడ్డి అన్నారు. సభ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అన్నివర్గాల ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎందుకు ఇంకా అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, అవినీతి అక్రమాలపై ఈ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని చెప్పారు. 15 రోజుల పాటు సభను నడపాలని తాము డిమాండ్ చేస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తామని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై అసెంబ్లీలో నిలదీస్తాం: పాయల్ శంకర్**

రేపటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్న తీరును ఎండగడతామని బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ తెలిపారు. తెలంగాణను దోచుకుంటున్న తీరు.. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలపై ప్రశ్నిస్తామని అన్నారు. విద్యార్థుల అవస్థలు, కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై నిలదీస్తామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు, అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను.. ఆ తర్వాత చేస్తున్న వాగ్ధానాలను సభలో ప్రశ్నిస్తామని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# ఆప్‌లోకి గ్యాంగ్‌స్టర్



**- పంజాబ్ ఎన్నికల ముందు కీలక పరిణామం**
**- గ్యాంగ్‌స్టర్ గురుప్రీత్ సింగ్ సేఖోన్**
**- జీరా అసెంబ్లీ నుంచి పోటీకి దిగే అవకాశం**

**చండీగఢ్, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. నాభా జైలు నుంచి పారిపోయిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గ్యాంగ్ స్టర్ గురుప్రీత్ సింగ్ సేఖోన్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో చేరారు. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని జీరాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సమక్షంలో పార్టీలో చేరారు. సేఖోన్ రాబోయే ఎన్నికల్లో జీరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. సేఖోన్ చేరితో ఆప్ జీరా సిట్టింగ్ ఎమ్మెల్యే నరేష్ కటారియా వర్గంలో చర్చ మొదలైంది.

2016లో నాభా జైలు ఘటన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. 2016 నవంబర్ 27న నాభా జైలు నుంచి ఆరుగురు ఖైదీలు తప్పించుకున్న కేసులో సేఖోన్ కీలక నిందితుడిగా ఉన్నారు. మళ్లీ ఇతడిని 2017 ఫిబ్రవరిలో మోగా జిల్లాలోని ధుడికే గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. ఇతడిపై హత్యా, హత్యాయత్నం సహా అనేక కేసులు ఉన్నాయి. సేఖోన్ తన ప్రాంతంలో స్థానిక రాజకీయాల్లో యాక్టివ్‌గా మారారు. కొన్ని నెలల క్రితం జిల్లా పరిషత్, బ్లాక్ సమితి ఎన్నికల్లో తన ఇద్దరు బంధువులను ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేయించి, విజయం సాధించారు.

జీరా అసెంబ్లీ నియోజకవర్గం గతంలో శిరోమణి అకాలీ దళ్‌కు బలమైన ప్రాంతంగా ఉండేది. మాజీ ఎమ్మెల్యే హరి సింగ్ జీరా మరణం తర్వాత ఆ పార్టీ ప్రభావం తగ్గింది. 2017లో కాంగ్రెస్‌కు చెందిన కుల్బీర్ సింగ్ జీరా గెలుపొందగా, 2022లో ఆప్‌కు చెందిన నరేశ్ కటారియా విజయం సాధించారు. ఇప్పుడు సెఖోన్ ఆప్‌లో చేరడంతో ఆ నియోజకవర్గంలో సమీకరణాలు మారిపోనున్నాయి.

# ఐరాస కొత్త వరల్డ్ మ్యాప్‌కి భారత్ మద్దతు

**- కానీ, ఆ ఒక్క విషయంలో మాత్రం అభ్యంతరం**
**- అమెరికా తప్ప 164 దేశాలు మద్దతు**
**- ఆఫ్రికాను అతిపెద్ద ఖండంగా చూపించడంపై**
**- అమెరికా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06, అనంతజనశక్తి న్యూస్**

భూభాగాల వాస్తవ పరిమాణాలను కచ్చితంగా ప్రతిబింబించేలా సమాన విస్తీర్ణ ప్రపంచ పటాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు వేసినట్లు విదేశాంగ శాఖ ఆదివారం తెలిపింది. అయితే, ఈ తీర్మానం ఏ నిర్దిష్ట మ్యాప్‌ను ఆమోదించదని, భారత అధికారిక పటానికి అనుగుణంగానే దేశ సార్వభౌమ భూభాగాన్ని చిత్రించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ''ఈ తీర్మానం ఏ నిర్దిష్ట ప్రపంచ పటాన్ని స్వీకరించదు లేదా ధ్రువీకరించదు.. అలాగే అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలు లేదా ప్రాంతాల పేర్లతో సహా రాజకీయ మ్యాప్‌ల విధానాన్ని ఇది ప్రస్తావించదు'' విదేశాంగ శాఖ తెలిపింది.

అయినప్పటికీ, భారత్ జమ్మూ కశ్మీర్, లడఖ్‌లపై తన వైఖరిని పునరుద్ఘాటించింది. ''జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారతదేశ సార్వభౌమ భూభాగం తప్పనిసరిగా భారత్ అధికారిక మ్యాప్‌నకు అనుగుణంగానే చూపాలి.. తప్పుగా లేదా తప్పుదోవ పట్టించేలా చిత్రీకరించడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. భారతదేశ సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతపై మా వైఖరి స్పష్టమైంది, స్థిరమైంది.. రాజీలేనిది'' అని భారత్ తెలిపింది.

ఖండాల భూభాగాల పరిమాణ నిష్పత్తిని సరిగ్గా చూపే సమాన విస్తీర్ణ పటాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'కరెక్ట్ ది మ్యాప్: రీబ్యాలెన్సింగ్ గ్లోబల్ కార్టోగ్రాఫిక్ రిప్రజెంటేషన్ అండ్ ప్రమోటింగ్ ఈక్విటబుల్ రిప్రజెంటేషన్ ఆఫ్ ది వరల్డ్స్ రీజియన్స్, పార్టిక్యులర్లీ ఆఫ్రికా'' అనే పేరిట తెచ్చిన ఈ తీర్మానాన్ని సెప్టెంబర్ 4న ఐరాస సర్వసభ్య సమావేశం 1641 ఓట్ల మెజారిటీతో ఆమోదించింది.

ఈ తీర్మానం ఖండాల విస్తీర్ణాన్ని సరిగ్గా చూపించే సమాన విస్తీర్ణ మ్యాప్‌ను వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. అయితే, ఇది ఏ నిర్దిష్ట పటాన్ని, ప్రొజెక్షన్‌ను లేదా జాతీయ సరిహద్దుల చిత్రీకరణను ఆమోదించినట్లుగా భావించకూడదని భారత్ స్పష్టం చేసింది. ''ఈ తీర్మానాన్ని సమాన విస్తీర్ణ మ్యాప్ ప్రొజెక్షన్ల విస్తృత వినియోగానికి మద్దతుగా మాత్రమే అర్థం చేసుకోవాలని, అంతే తప్ప 'ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్' లేదా ఇతర నిర్దిష్ట మ్యాప్ ప్రొజెక్షన్లను ఆమోదించినట్లుగా భావించకూడదని మేము నమ్ముతున్నాం'' అని భారత దౌత్యవేత్త రఘు పూరి ఓటింగ్ సందర్భంగా పేర్కొన్నారు.



# రోజూ 90 నిమిషాల వ్యాయామంతో పదేళ్లు ఎక్కువ బతకొచ్చు

ఆరోగ్యంగా జీవించడానికి, ఆయుష్షు పెంచుకోవడానికి వ్యాయామం అత్యంత శక్తిమంతమైన ఔషధమని ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైంది. "దీర్ఘాయువు కోసం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఔషధం"గా అభివర్ణించారు. "రోజుకు కేవలం 90 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల చావు ముప్పు 15% తగ్గుతుంది. అంతేకాదు.. మీరు దాదాపు పది సంవత్సరాలు ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంది. శరీరానికి అస్సలు కదలిక లేకపోవడం ధూమపానం కంటే కూడా ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. శారీరక శ్రమ వల్ల రక్తనాళాలు, గుండె, శ్వాస వ్యవస్థ, జీవక్రియల పనితీరు మెరుగుపడుతుందని, ఇది చావు ముప్పును గణనీయంగా తగ్గిస్తుందని ఆయన వివరించారు.









## ఏ వ్యాయామం ఉత్తమం?

మరి ఇంతకీ ఏ వ్యాయామం చేయాలని చాలామందికి సందేహం ఉంటుంది. దీనికి సమాధానంగా, డాక్టర్ చోప్రా పుల్-అప్ బార్‌కు వేలాడటం ఉత్తమమైన వ్యాయామంగా సూచించారు. "పురుషులు రెండు నిమిషాలు, మహిళలు 90 సెకన్లు ఈ వ్యాయామం చేయాలి. శక్తి శిక్షణ అనేది మన భవిష్యత్తు కోసం చేసే ఒక పొదుపు ప్రణాళిక లాంటిది" అని ఆయన ఉద్ఘాటించారు.

## గ్రిప్ స్ట్రెంత్ ఎందుకు ముఖ్యం?

వ్యాయామం వల్ల శారీరక ప్రయోజనాలతో పాటు, అది మానసిక ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని డాక్టర్ చోప్రా తెలిపారు. మనం వ్యాయామం చేసినప్పుడు శరీరం కొంత ఒత్తిడికి గురై, దాన్ని తట్టుకునేందుకు సిద్ధమవుతుందని, ఆ తర్వాత అది సాధారణ స్థితికి వస్తుందని ఆయన వివరించారు. ఇది మనసును కూడా గట్టిపరుస్తుందని, జీవితంలో పెద్ద ఒత్తిళ్లు ఎదురైనప్పుడు వాటిని తట్టుకునే శక్తిని ఇస్తుందని చెప్పారు.

అన్ని రకాల వ్యాయామాలకు గ్రిప్ స్ట్రెంత్ చాలా ముఖ్యమని, ఇది మన మొత్తం బలానికి అద్దం పడుతుందని డాక్టర్ చోప్రా పేర్కొన్నారు. "పుల్-అప్స్ చేయడం గ్రిప్ స్ట్రెంత్‌ను పెంచడానికి ఉత్తమ మార్గాలలో ఒకటి. వేలాడటం, లాగడం, మళ్లీ చేయడం.. ఇది సరళమైనది, శక్తిమంతమైనది. గ్రిప్ స్ట్రెంత్ అన్ని వయసుల వారికి ముఖ్యం. ఇది కాళ్ళు, గ్లూట్స్ కండరాలకు కూడా సహాయపడుతుంది. గోల్ఫ్ ఆడటం, వస్తువులను పట్టుకోవడం, బరువులు మోయడం వంటి ప్రతి శారీరక కార్యకలాపానికి గ్రిప్ అవసరం" అని ఆయన పేర్కొన్నారు.

# పిల్లలకు తరచుగా జలుబు, జ్వరాలు వస్తున్నాయా? రోగనిరోధక శక్తి పెంచడానికి 3 మార్గాలు ఇవే





మీ పిల్లలకు తరచూ జలుబు, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయా? రోజూ స్కూలుకు, డే కేర్‌కు వెళ్లే పిల్లలు ఇలా జబ్బుపడటం చూసి చాలామంది తల్లిదండ్రులు ఆందోళన పడుతుంటారు. ఇది చాలా సాధారణమైన విషయం, ముఖ్యంగా ఏడు సంవత్సరాల లోపు పిల్లలకు ఇలా జరగడం సహజం. ఎందుకంటే వారి రోగనిరోధక వ్యవస్థ ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందదు. బడికి వెళ్తున్నప్పుడు కొత్త సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియాలు, వైరస్‌లకు గురై వాటితో పోరాడటం నేర్చుకుంటుంది. తరచూ అనారోగ్యానికి గురవుతున్నారంటే, వారి రోగనిరోధక వ్యవస్థ బలోపేతం అవుతోందని అర్థం చేసుకోవాలి.పిల్లల్లో పటిష్టమైన రోగనిరోధక వ్యవస్థను నిర్మించడానికి కొన్ని అంశాలు అవసరం. సమతుల్య ఆహారం, శారీరక శ్రమ, తగినంత నిద్ర, పరిశుభ్రత, ఒత్తిడి లేని వాతావరణం. అపరిశుభ్రమైన ప్రదేశాలు, రద్దీగా ఉండే ప్రాంతాలు, సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వంటివి పిల్లల రోగనిరోధకతపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.





## 1. టీకాలు వేయించడం మర్చిపోవద్దు

పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేయించడం చాలా ముఖ్యమని డాక్టర్ పరేఖ్ తెలిపారు. రోగనిరోధక వ్యవస్థను బలహీనపరిచే వైరస్‌లు లేదా బ్యాక్టీరియాలను టీకాల ద్వారా శరీరంలోకి ప్రవేశపెడతారు. దీనివల్ల శరీరం యాంటీబాడీలను ఉత్పత్తి చేయడం, భవిష్యత్తులో వచ్చే రోగాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండటం వంటివి నేర్చుకుంటుంది. టీకాల షెడ్యూల్‌ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, ఒకవేళ ఏ డోస్ మిస్ అయినా అంతకు ముందు వేసిన డోస్‌లు కూడా పనిచేయకుండా పోయే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.

## 2. విటమిన్ డి కోర్స్

విటమిన్ డిని డాక్టర్ పరేఖ్ "మ్యాజిక్ విటమిన్"గా అభివర్ణించారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఎముకల ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం, ఫాస్పరస్‌ను శరీరం గ్రహించడానికి విటమిన్ డి సహాయపడుతుంది. దీనితో పాటు, ఇది రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుందని, ఒత్తిడి, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలను కూడా తగ్గిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. విటమిన్ డి కోసం సూర్యరశ్మి, ఆహారం సరిపోదు కాబట్టి, సప్లిమెంట్స్ తీసుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్ పరేఖ్ సూచించారు. అయితే, ఏ వయసు పిల్లలకు ఎంత మోతాదులో ఇవ్వాలనేది వైద్యుడిని సంప్రదించి నిర్ణయించుకోవాలని ఆయన చెప్పారు.

## 3. రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలు

పదేపదే అనారోగ్యానికి గురయ్యే పిల్లలకు రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలు, లేదా మందుల గురించి వైద్యులతో మాట్లాడాలని తల్లిదండ్రులకు సూచించారు. విటమిన్ సి, విటమిన్ డి, జింక్ వంటి సహజ పోషకాలు లభించే పండ్లు, కూరగాయలు, పెరుగులో ఉండే ప్రొబయోటిక్స్, అలాగే అవకాడో, చేపలు, నట్స్‌లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు మీ పిల్లల ఆహారంలో ఉండేలా చూడాలని ఆయన సలహా ఇచ్చారు.

అనంత జనశక్తి

సోమవారం | అనంతపురం
07.09.2026



# ఐటీ ఉద్యోగంలోనే ఉండిపోయేవాణ్ని!

"సాధారణంగా ఓ హిట్ సినిమా అవ్వగానే దానికి సీక్వెల్ చేయడం నా అలవాటు కాదు. కానీ, 'సర్దార్' విషయానికొస్తే ఆ పాత్రలో కొత్తగా ఆవిష్కరించడానికి చాలా కోణాలు మిగిలే ఉన్నాయనిపించింది. తొలి భాగం ముగింపులోనే పార్ట్-2కి మంచి స్కోప్ లభించింది. కొన్నాళ్ల క్రితం దర్శకుడు మిత్రన్ నా దగ్గరకొచ్చినప్పుడు 'సర్దార్' మళ్లీ ఎందుకు తిరిగి రావాలో దానికొక బలమైన ప్రయోజనాన్ని కనుగొన్నాని చెప్పారు. అలాగే ఈసారి తొలి భాగంలో కంటే శక్తిమంతమైన ఓ విలన్ కాన్సెప్ట్‌ని సిద్ధం చేసినట్లు చెప్పాడు. ఆ కథ విన్నాక 'సర్దార్ 2' కచ్చితంగా చేయాల్సిందేనని నిర్ణయించుకున్నా. ఇందులో తొలి భాగంలోని నీళ్ల కాన్సెప్ట్ కంటే పదిరెట్లు ఎక్కువ ప్రభావం చూపే కాన్సెప్ట్ ఒకటుంది. అదేంటన్నది నేను చెప్తే బాగోదు.. తెరపై చూసి థ్రిల్ అవ్వాల్సిందే. దాదాపుగా గూఢచారి చిత్రాలన్నీ బయట దేశాల్లోనే జరుగుతుంటాయి. కానీ, ఈ సినిమాలో భారత్‌లో జరుగుతున్న ఓ సమస్యనే ఒక గూఢచారి ఎలా హ్యాండిల్ చేశాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. మొదటి పార్ట్‌లో ఉన్న ఎమోషన్స్, డ్రామాలు కొనసాగుతూనే ఈసారి యాక్షన్, స్పై అంశాలు మరోస్థాయిలో ఉండనున్నాయి".



# అదితి ప్రేమకథ పూర్తి!



కళ్లతోనే హావభావాల్ని పలికిస్తూ.. తనదైన నటనతో వెండితెరపై ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది అందాల తార అదితి రావ్ హైదరీ. రెండేళ్ల క్రితం 'హీరామండీ' సిరీస్‌లో బిబ్బోజాన్ పాత్రలో మెరిసి తన నృత్యంతో ఓటీటీ వేదికగా కుర్రకారుని అలరించిన ఈమె.. ఇప్పుడు ప్రేమికురాలిగా మరో సిరీస్‌తో సందడి చేయడానికి సిద్ధమైంది. అదితి, అర్జున్ రాంపాల్, అవినాశ్ తివారీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సిరీస్ 'ఓ సాథీ రే'. ప్రముఖ దర్శకుడు ఇంతియాజ్ అలీ షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు ఆరిఫ్ అలీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోల్ని పంచుకున్నారు ఇంతియాజ్ అలీ. వింటేజ్ లవ్‌స్టోరీగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలోనే విడుదల తేదీని అధికారికంగా వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సిరీస్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అదితి ఖాతాలో 'పరివారిక్ మనురంజన్' చిత్రముంది.

# అలాంటి సినిమాల్ని ఎప్పటికీ అంగీకరించను!



"సినిమాల్లో మహిళలను కేవలం వస్తువులుగా చూపించడాన్ని నేను అంగీకరించను" అని అంటోంది కథానాయిక కయాదు లోహర్. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంటోందీ తార. ఈ ఏడాది ఇప్పటికే 'ఇదయం మురళి', 'ఐమ్ గేమ్', 'ఇమ్మోర్టల్' లాంటి పలు చిత్రాలతో తెరపై మెరిసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కయాదు.. సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానంపై కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "కేవలం సినీప్రియుల దృష్టిని ఆకర్షించడం కోసమే నటీమణులను అసభ్యకరంగా చూపించే చిత్రాలలో నేను భాగం కావాలనుకోవడం లేదు. మహిళలను ఓ అనవసర వస్తువులా చూపించడం నాకు అస్సలు నచ్చదు. కానీ కథకు, పాత్రకు అది అవసరమని నాకు నమ్మకం కలిగితే.. ఓ స్థాయి వరకు దాన్ని నేను అంగీకరిస్తా. అంతేకానీ దృష్టిని ఆకర్షించడం కోసం అలాంటి పనులు చేయడం నాకిష్టం లేదు. అది అప్పడప్పుడు ఇన్‌స్టాలో ట్రెండ్ అవ్వొచ్చు. కానీ ఆ ఆలోచన నాకు ఏమాత్రం సౌకర్యవంతంగా అనిపించదు. అలాంటి సినిమాలను ఎన్నటికీ అంగీకరించను" అని చెప్పకొచ్చింది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'ది ప్యారడైజ్', 'సూర్య 48' తదితర చిత్రాలున్నాయి.

# ప్రియాంక కొత్త ప్రయాణం

వైవిధ్యమైన కథలు, పాత్రలతో దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది కథానాయిక ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ' సినిమాతో తెరపై మెరిసిన ఈమె.. ఇప్పుడు మరో కొత్త చిత్రాన్ని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆమె, కథానాయకుడు జై ప్రధాన పాత్రల్లో ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి ఎంఎస్ ఆనందన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటిస్తూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది ప్రియాంక. "ఒక ఉత్కంఠభరితమైన కొత్త ప్రయాణం మొదలవుతోంది" అనే వ్యాఖ్యను జోడించింది. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని క్రైమ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలో నటీనటులకు సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి. ఇందులో యోగిబాబు కీలక పాత్రలో నటిస్తున్నారు.





# యూఏఈ జట్టులో శ్రీకాళహస్తి అమ్మాయి

ఆసియా క్రీడల్లో తలపడుతున్న భారత జట్టులో శ్రీచరణి, అరుంధతి రెడ్డి రూపంలో ఇద్దరు తెలుగమ్మాయిలున్నారు. వీరితో పాటు ఇంకో తెలుగమ్మాయి కూడా టోర్నీలో పోటీపడుతోంది. కాకపోతే ఆమె ఆడుతోంది యూఏఈకి. తన పేరు.. సురక్ష కొట్టే. ఆమె కుటుంబ స్వస్థలం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి. సురక్ష తండ్రి కొట్టే సుధీర్ శ్రీకాళహస్తి వాసి. ఆయన వృత్తిరీత్యా యూఏఈలో స్థిరపడ్డారు. క్రికెట్‌ను ఎంతో ఇష్టపడే సుధీర్.. తన కుమార్తెను ఆ ఆటలో ప్రోత్సహించారు. యూఏఈలోనే పుట్టి పెరిగిన సురక్ష.. క్రికెట్ అంచెలంచెలుగా ఎదిగి జాతీయ జట్టులో చోటు సంపాదించింది. కుడిచేతి వాటం ఆఫ్‌స్పిన్నరైన సురక్ష.. ఇప్పటిదాకా 63 అంతర్జాతీయ టీ20లు ఆడి 46 వికెట్లు తీసింది. ఆమె 5 వన్డేలు కూడా ఆడింది. ఆసియా కప్‌లో ఇండోనేసియాతో మ్యాచ్‌లో సురక్ష 4 ఓవర్లలో ఒక మెయిడెన్ వేయడంతో పాటు 16 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టింది. అయితే యూఏఈ గ్రూప్-బిలో ఉండడం, ఆ జట్టు సెమీస్ చేరే అవకాశం లేకపోవడంతో భారత్‌తో ఆడే అవకాశం సురక్షకు లేకపోయింది. సురక్షను భారత జట్టుకు ఆడించాలన్నది ఆమె తండ్రి ఆశయమని, ఆ దిశగా సురక్ష ప్రయత్నం చేస్తోందని శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ తెలిపారు.



# క్వార్టర్స్‌లో సబలెంకా

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టైటిల్ ఫేవరెట్ అర్యానా సబలెంకా క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్‌స్‌లో టాప్ సీడ్ సబలెంకా 6-4, 6-3తో టౌన్‌సెండ్ (అమెరికా)ను ఓడించింది. తొలి సెట్లో ఈ బెలారస్ తారకు టౌన్‌సెండ్ నుంచి గట్టిపోటీనే ఎదురైంది. అయితే ఆరో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన సబలెంకా 4-2తో ఆధిక్యంలో నిలిచింది. ఆపై అదే జోరుతో సెట్ గెలిచింది. రెండో సెట్లో టౌన్‌సెండ్ విజృంభించింది. ఒక దశలో 3-1తో సెట్ గెలిచే దిశగా సాగింది. కానీ సబలెంకా బలంగా పుంజుకుంది. తర్వాతి అయిదు గేమ్‌లను చేజిక్కించుకుని సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ పోరులో ఆమె 2 ఏస్‌లు, 14 విన్నర్లు కొట్టింది. మరోవైపు ఇగా స్వైటెక్ (పోలెండ్) ప్రిక్వార్టర్స్ చేరింది. ఎనిమిదో సీడ్ స్వైటెక్ 7-6 (7-3), 7-6 (7-3)తో 25వ సీడ్ బౌజ్కోవా (చెకియా)ను ఓడించింది. మ్యాచ్‌లో స్వైటెక్ అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది. 35 విన్నర్లు కొట్టింది.

గాఫ్ ముందుకు: నాలుగో సీడ్ కొకో గాఫ్ (అమెరికా) ప్రిక్వార్టర్స్ చేరింది. మూడో రౌండ్ మ్యాచ్‌లో ఆమె 6-3, 6-4తో క్రిస్టీనా బుసా (స్పెయిన్)ను ఓడించింది. రెండో సీడ్ రిబకినా (కజకిస్థాన్), అయిదో సీడ్ ఆండ్రీవా (రష్యా), పదమూడో సీడ్ ఒసాకా (జపాన్) కూడా ముందంజ వేశారు. రిబకినా 7-6 (8-6), 6-3తో స్ట్రాడట్‌త్సెవా (ఉక్రెయిన్)ను ఓడించగా.. ఒసాకా 6-3, 3-6, 7-5తో మెర్టిన్స్ (బెల్జియం)పై, ఆండ్రీవా 6-2, 7-6 (7-5)తో బార్టున్‌కోవా (చెకియా)పై పైచేయి సాధించారు. అమెరికా టీనేజర్ జోవిచ్ కూడా మూడో రౌండ్ దాటింది. ఆమె 7-5, 3-6, 7-5తో అలెగ్జాండ్రా ఏలా (చెకియా) పోరాటానికి తెరదించింది.




# సాత్విక్, చిరాగ్ జోడీకి చైనా మాస్టర్స్ టైటిల్

గత నెల సొంతగడ్డపై జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌స్‌లో నిరాశపరిచిన సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి జోడీ.. ఇప్పుడు స్థాయికి తగ్గ ప్రదర్శనతో చైనా మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ, ఆదివారం జరిగిన ఫైనల్లో 11-21, 21-13, 21-17తో చైనాకు చెందిన ప్రపంచ మాజీ నంబర్ 4 జంట హె జి టింగ్, రెన్ జియాంగ్ యుల విజయం సాధించింది. సాత్విక్-చిరాగ్ జంట ఈ టోర్నీలో 2023, 2025లో రన్నరప్‌గా నిలిచింది. ఈ ద్వయం ఈ ఏడాది మేలో సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఉన్న సాత్విక్, చిరాగ్ ద్వయానికి ఈ టైటిల్ మరింత ఉత్తేజాన్నిస్తుందనడంలో సందేహం లేదు.




వెనుకబడి..: చైనాతో జంటతో గతంలో తలపడ్డ రెండు సార్లూ పైచేయి సాధించిన సాత్విక్, చిరాగ్ జంట.. ఈసారి తడబాటుగా ఆరంభించింది. మొదట్లో ర్యాలీలపై నియంత్రణ సాధించలేకపోయింది. ఎటాకింగ్ గేమ్‌తో టింగ్-రెన్ ద్వయం 5-0తో ఆధిక్యంలోకి దూసుకుపోయింది. కట్టుదిట్టంగా సర్వీస్ చేసింది. టింగ్ స్మాష్‌తో చైనా జోడీ 8-3తో నిలిచింది. వాళ్ల డిఫెన్స్‌ను ఛేదించడానికి భారత ద్వయం ప్రయత్నించింది. కానీ దూకుడు ప్రదర్శించిన ప్రత్యర్థి జంట.. విరామానికి ఆరు పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ఆధిక్యాన్ని 14-7కు పెంచుకుంది. క్రమంగా 17-9కు చేరుకున్న చైనా జోడీ.. అలవోకగా తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. కానీ రెండో గేమ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం అద్భుతంగా పుంజుకుంది. డిఫెన్స్‌ను బలోపేతం చేసుకున్న ఈ భారత జంట, ర్యాలీలను పొడిగించింది. సాత్విక్ చక్కగా సర్వ్ చేశాడు. గేమ్ నువ్వానేనా అన్నట్లు మొదలైంది. ప్రత్యర్థి శరీరానికి చిరాగ్ కొట్టిన స్మాష్‌తో భారత జంట 9-6తో ఆధిక్యంలో నిలిచింది. ఆ జోడీకి వరుసగా లభించిన అయిదో పాయింట్ అది. కానీ సాత్విక్ సర్వీస్ తప్పిదంతో ఆ వరుసకు తెరపడింది. అయితే తిరిగి పట్టుబిగించిన భారత జంట.. విరామానికి నాలుగు పాయింట్ల ఆధిక్యం సంపాదించింది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314